**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 67, పేజీలు - 08

గురువారం, సెప్టెంబర్ 3, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## కేపీహెచ్‌బీలో గజం రూ.2.70 లక్షలు

**- రికార్డు ధరలకు ప్లాట్ల వేలం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో భూముల ధరలు మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే కోకాపేట, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో భూముల ధరలు భారీ స్థాయికి చేరిన విషయం తెలిసిందే. తాజాగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ)లో నిర్వహించిన భూముల బహిరంగ వేలం కూడా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లకు బుధవారం నిర్వహించిన వేలంలో చదరపు గజం గరిష్ఠంగా రూ. 2.70 లక్షలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లకు తెలంగాణ హౌసింగ్ బోర్డు తాజాగా బహిరంగ వేలం నిర్వహించింది. ఈ వేలానికి ముందుగా

2లో..

## దేవరకద్ర డీఆర్‌డీఎల్‌కు ఉచితంగా

# భూమి కేటాయించండి

**- కేంద్రాన్ని కోరిన సీఎం రేవంత్ రెడ్డి**

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్
- డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం
- రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం

న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ని ఆహ్వానించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే డిఫెన్స్ ఎక్స్‌పో 2026ను ప్రారంభించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు. ముఖ్యమంత్రి పలువురు ఎంపీలతో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

**ఎయిర్‌షో నిర్వహణకు అనుమతులు ఇవ్వండి**

దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు,

2లో..



## తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ కీలక ప్రకటనలు

**- డీజిటల్ డీఎల్, చెన్నైపై వరాలు**



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు వ్యాప్తంగా గత అయిదేళ్ల కాలంలో నిరసనలు తెలిపిన రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరిస్తున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో ప్రకటించారు. రూల్ 110 కింద ఆయన ఈ అంశాన్ని ప్రతిపాదించారు. ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా, మానవతా దృక్పథంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. 2021 మే నుంచి ఈ ఏడాది ఏప్రిల్ మధ్య కాలంలో నమోదైన కేసులన్నీ ఇందులో ఉన్నాయి. పరందూరు విమానాశ్రయ నిర్మాణం వల్ల సాగు భూమితో పాటు జీవనోపాధి కోల్పోతామంటూ రైతులు చేసిన ఆందోళనల, తిరువణ్ణామలై సిప్‌కాట్ పారిశ్రామిక జోన్‌కు వ్యతిరేకంగా సాగిన నిరసనల్లో నమోదైన కేసులన్నింటినీ కూడా ఎత్తివేస్తోన్నామని, వివాదాస్పద పీడీ యాక్ట్ కింద దాఖలైన కేసులను కూడా రద్దు చేస్తోన్నట్లు విజయ్ ప్రకటించారు. రైతులు, ఉపాధ్యాయులకు ఎప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన

2లో..

# ఉత్తరాంధ్రకు గోదారమ్మ పరవళ్లు

**- జలహారతి పట్టిన సీఎం చంద్రబాబు**



- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి చేరిన గోదావరి జలాలు
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న హామీని నెరవేర్చామని చెప్పిన సీఎం చంద్రబాబు
- భవిష్యత్తులో సింహాచలం, అరసవల్లికి నీటిని తరలిస్తామని ప్రకటన
- ఉత్తరాంధ్రను ఉన్నతాంధ్రగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ, పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి గడ్డపై అడుగుపెట్టాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సాధించిన ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా అనకాపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామన్న మాటకు కట్టుబడి

2లో..



## తెలంగాణపై

# దరిద్రం దండయాత్ర

- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జిషీట్ - కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ - రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎంగిలి విస్తరాకుల కాడ కుక్కలు కొట్లాడుకున్నట్టు, రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో ఈ 1000 రోజుల్లో కాంగ్రెస్ మంత్రులు, ముఖ్యమంత్రులు తన్నుకున్నారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఛార్జ్ షీట్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ "కాంగ్రెస్ పాలన జెన్- జి భాషలో చెప్పాలి అంటే అసమర్థత- ప్రో మాక్స్, అవినీతి- అల్ట్రా మాక్స్ , అరాచకం-ఐమాక్స్. సమర్థవంతమైన రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కుక్కలు చింపిన విస్తరిలా మార్చింది. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టో. వంద రోజుల్లో స్వర్గం

2లో..

## వైఎస్ఆర్‌కు వైఎస్ జగన్, షర్మిలా నివాళులు

**- కుమారుడిని చూసి విజయమ్మ భావోద్వేగం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద బుధవారం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా, వైఎస్ఆర్ సతీమణి వైఎస్ విజయమ్మ నివాళులర్పించారు. తండ్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి వైఎస్ జగన్ అంజలి ఘటించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని వైఎస్ఆర్‌ను గుర్తుచేసుకున్నారు.

**విజయమ్మ భావోద్వేగం**

వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం

2లో..

# నాపై ఒక్క అవినీతి మచ్చ లేదు

- ముందు సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి
- మీడియాతో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు
- మంత్రిగా బాగా పనిచేస్తున్నాను, నన్ను పదవిలో కొనసాగించండి
- కాంగ్రెస్ హైకమాండ్‌కు కొండా సురేఖ విజ్ఞప్తి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్‌లో చెలరేగిన అంతర్గత విభేదాలు ఢిల్లీ వేదికగా మరోసారి తీవ్ర రసతవత్తరంగా మారాయి. తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. తనపై చర్యలు తీసుకునే ముందు మంత్రివర్గంలో ఇతరులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలను కలిసిన అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కొండా సురేఖ ఈ వ్యాఖ్యలు చేశారు. బీసీ మహిళా నాయకురాలినైన తనను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో

2లో..

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన

# ప్రజా రంజకం

**- ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదన్న పొంగులేటి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో

2లో..

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను



**- రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారన్న రాజ్‌గోపాల్ రెడ్డి
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలురాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను పరోక్షంగా వ్యక్తం చేస్తూ సమయం వచ్చినప్పుడు తనను ఎవరూ ఆపలేరని ఆయన వ్యాఖ్యానించారు.

2లో..

## జనసేన యువజన విభాగానికి

# 'జై కొట్టు'గా నామకరణం

**- పిఠాపురంలో లోగోను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్**



అమరావతి (ప్రశ్న న్యూస్) బుధవారం ఏపీ డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ యువజన విభాగాన్ని ఆవిష్కరించారు. జనసేన పార్టీ యువజన విభాగానికి 'జై కొట్టు' అని నామకరణం చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో బుధవారం జరిగిన ఓ భారీ కార్యక్రమంలో

2లో..

## ఆపరేషన్ సింధూర్ కమాండర్‌కు

# అయోధ్య బాధ్యత

**- ఆలయ ట్రస్ట్ కీలక నిర్ణయం**

3లో..



# ఉత్తరాంధ్రకు గోదారమ్మ పరవళ్లు

ఉన్నామని, దాని ఫలితమే ఈ జలయజ్ఞమని అన్నారు.

### మాట నిలబెట్టుకున్నాం.. పునర్నిర్మాణం చేస్తున్నాం

గత ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించారని చంద్రబాబు గుర్తుచేశారు. "ఆ దీవెనల ఫలితమే నేడు అనకాపల్లికి గోదావరమ్మను తీసుకురావడం. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మను మార్కాపురానికి తరలించాం. ఈరోజు పోలవరం ఎడమ కాలవ ద్వారా గోదావరిని అనకాపల్లికి తీసుకొచ్చాం. ఇది ఒక చారిత్రక ఘట్టం" అని ఆయన అన్నారు. హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు తూర్పు కనుమలు, అడవులు, వాగులను దాటుకుని తరలివస్తున్న గోదావరి జలాలను చూసి ఎంతో సంతృప్తి కలిగిందని తెలిపారు. "అనకాపల్లి బెల్లం ఎంత తీయగా ఉంటుందో, ఈ రోజు అంతే తీయగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని సీఎం వ్యాఖ్యానించారు.

### ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే జల ప్రణాళిక

ఈ జల ప్రవాహం ఇక్కడితో ఆగదని, వచ్చే ఏడాది సింహాద్రి అప్పన్న చెంతకు, ఆ తర్వాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి పాదాల చెంతకు గోదావరి జలాలను తీసుకెళ్లి వంశధార నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "గలగల గోదావరి, బిరబిరా కృష్ణమ్మ అని పాటల్లో విన్నాం. ఇప్పుడు దానిని నిజం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ జల విజయం ప్రజల విజయం," అని ఆయన అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ ప్రాజెక్టును అనుసంధానించి 12 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ. 3,200 కోట్లు ఖర్చు చేస్తామని, 2028 నాటికి వాటిని జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

### గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019 నాటికి మేము పోలవరం పనులను 72% పూర్తి చేశాం. కానీ తర్వాత వచ్చిన గద్దలి పార్టీ నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు గోదావరి పాలయ్యే పరిస్థితికి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు పెట్టని ఆ నాయకుడు, తన నివాసం కోసం రుషికొండలో ప్యాలెస్‌కు రూ. 500 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ డబ్బుతో నాలుగైదు ప్రాజెక్టులు పూర్తయ్యేవి" అని ఆయన ఆరోపించారు. విశాఖకు డేటా సెంటర్ వస్తే నీరు, విద్యుత్ కొరత వస్తుందని ఇప్పుడు పేటీఎం బ్యాచ్‌తో ప్రచారం చేయిస్తున్నారని, కానీ ఐదు డేటా సెంటర్లకు అవసరమైన దానికంటే వందల రెట్లు ఎక్కువ నీటిని ఇచ్చే శక్తి తమకుందని స్పష్టం చేశారు. భోగాపురం, వెలిగొండలాగే ఈ ప్రాజెక్టు క్రెడిట్‌ను కూడా దొంగిలించేందుకు గత పాలకులు ప్రయత్నిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దార్శనికత

"సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. జలం ఉంటేనే జీవం, జీవితం," అని చంద్రబాబు అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని కేటాయిస్తామని వివరించారు. అదానీ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్, ఫార్మా వంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు. "ఒకప్పుడు హైదరాబాద్ పక్కన రంగారెడ్డి ఎలా అభివృద్ధి చెందిందో, రేపు అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది. ఉత్తరాంధ్ర నుండి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు వస్తారు. ఉత్తరాంధ్ర ఉత్తమాంధ్రగా, ఉన్నతాంధ్రగా మారుతుంది. ఇది ఖాయం, రాసిపెట్టుకోండి" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

### ప్రజలకు పిలుపు.. భవిష్యత్తుకు భరోసా

గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ, పురుషోత్తపట్నం ద్వారా నదుల అనుసంధానం చేశానని, ఇప్పుడు అనకాపల్లికి నీరు తెచ్చానని, రాబోయే మూడేళ్లలో రూ. 35,000 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. "పాలకులం కాదు, మీకు సేవకులం. పదవి అంటే పెత్తనం కాదు, జవాబుదారితనం.

మాకు అహంకారం లేదు, అంకితభావం ఉంది" అని అన్నారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'తో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్‌కు వైఎస్ జగన్, షర్మిలా నివాళులు

జగన్‌ను చూడగానే విజయమ్మ భావోద్వేగానికి గురయ్యారు. ఆయనను ఆప్యాయంగా హత్తుకుని ముద్దుపెట్టుకున్నారు. జగన్‌తో పాటు ఆయన సతీమణి వైఎస్ భారతిని కూడా విజయమ్మ దగ్గరకు తీసుకుని, ముద్దుపెట్టుకుని ఆశీర్వదించారు. అయితే వైఎస్ జగన్, వైఎస్ షర్మిలా వేరు వేరుగా వచ్చి తండ్రికి నివాళులర్పించారు.

### వేరు వేరుగానే నివాళులు

వైఎస్ఆర్ ప్రజాసేవను, సంక్షేమ కార్యక్రమాలను వైఎస్ జగన్ గుర్తుచేసుకున్నారు. తల్లి విజయమ్మ ఆశీర్వాదం కోసం వెళ్లగా జగన్‌ను విజయమ్మ ముద్దాడింది. అనంతరం వైఎస్ఆర్ ఘాట్ సమీపంలోనే ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైసీపీ కార్యకర్తలను కలుసుకొని ఇడుపులపాయలో ఉన్న హెలీప్యాడ్‌కు చెరుకొన్నారు జగన్. హెలీకాప్టర్‌లో బెంగుళూరుకు బయలుదేరి వెళ్లారు. వైఎస్ జగన్ వెళ్లిన తర్వాత గెస్ట్ హౌస్‌లో ఉన్న పీసీసీ ఛీఫ్ షర్మిలా తల్లి విజయమ్మతో కలిసి బుధవారం ఉదయం 9 గంటలకు వైఎస్ఆర్ ఘాట్ వద్దకు వచ్చారు. ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం తల్లి విజయమ్మతో కలిసి తండ్రి వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పించారు.

### మరణం లేని మహానేత - వైఎస్ షర్మిలా

వైఎస్ఆర్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ షర్మిలా ఎక్స్ వేదికగా పోస్టు కూడా పెట్టారు. 'మరణం లేని మహానేత డాక్టర్ వైఎస్సార్. కోట్లాది ప్రజల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రిది ఎన్నటికీ చెరగని స్థానం. నేడు 17వ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయ ఘాట్ వద్ద నివాళులు అర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాను. వైఎస్ఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు నేటికి చెరపని ముద్ర. దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే అధ్యాయం. పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించిన మహత్తర పథకం ఆరోగ్య శ్రీ. కోట్లాది మంది పేద బిడ్డలకు ఉచిత విద్యను అందించి చదువులకు భరోసా కల్పించిన పథకం ఫీజు రియంబర్స్మెంట్. ఉచిత విద్యుత్ ద్వారా రైతు సంక్షేమానికి, జలయజ్ఞంతో సాగునీటి రంగానికి సరికొత్త నడక నేర్పిన అపర భగీరథుడు వైఎస్ఆర్. 108,104 అంబులెన్స్ సేవలు, రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ లాంటి ఎన్నో పథకాలు నేటికి చిరస్మరణీయం" అని షర్మిలా అన్నారు.

# నాపై ఒక్క అవినీతి మచ్చ లేదు

ఢిల్లీ వెళ్లిన కొండా సురేఖ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు.తాను మంత్రిగా తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నానని అధిష్ఠానం పెద్దలకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. తనపై ఇప్పటివరకు ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేదని పేర్కొన్నారు. తాను మంత్రిగా మంచి పర్ఫార్మెన్స్ ఇస్తున్నానని ప్రజలకు ఇంకా సేవ చేయాలని భావిస్తున్నానని అందుకే తనను మంత్రి పదవిలో కొనసాగించండి అంటూ తన అభిప్రాయాలని హైకమాండ్‌కు వివరించినట్లు సురేఖ తేల్చి చెప్పారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేతలపైనా క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేయాలని, వారిపై చర్యలు తీసుకోవాలని కొండా సురేఖ డిమాండ్ చేశారు.ఇక పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాత్రం ఇంకా సమావేశం కాలేదని, ఆయన బిజీగా ఉన్నారని తెలిపారు. తనను ఇప్పటివరకు రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని స్పష్టం చేశారు. అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తున్నట్లు చెప్పారు. ఇక తెలంగాణలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పార్టీ పెద్దలందరికీ రాతపూర్వకంగా వివరించినట్లు కొండా సురేఖ వెల్లడించారు. తనపై తీసుకునే నిర్ణయంతో పాటు తాను లేవనెత్తిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేను కోరినట్లు చెప్పారు.ఇక తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యల వివాదంపై కూడా మంత్రి సురేఖ స్పందించారు. తన కుమార్తె వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని అన్నారు. కుటుంబ సభ్యురాలు చేసిన వ్యాఖ్యల కారణంగా తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. మహిళలు స్వతంత్రంగా ఎదగాలని, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని కాంగ్రెస్ అగ్రనేతలు చెబుతున్న విషయాన్ని సురేఖ ప్రస్తావించారు. కొన్ని పరిణామాల నేపథ్యంలోనే తన కుమార్తె స్పందించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనకు షోకాజ్ నోటీసులు ఇవ్వడమే తప్పు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.తాను బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ మహిళా నాయకురాలినైనందునే తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని కొండా సురేఖ ఆరోపించారు. కాంగ్రెస్‌లో బీసీలకు ఒక న్యాయం, ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయం ఉంటుందా అని ప్రశ్నించారు. కేబినెట్‌లోని ఇతర సామాజిక వర్గాలకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. అలాంటి ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. తన విషయంలో మాత్రమే క్రమశిక్షణను ప్రస్తావించడం ఎందుకని నిలదీశారు.పార్టీలో, ప్రభుత్వంలో జరుగుతున్న వ్యవహారాలపై తాను అధిష్ఠానానికి వివరాలు అందించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. కేబినెట్‌లోని పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులపై అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు వస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. వాటిపై పార్టీ, ప్రభుత్వం ఏం సమాధానం చెబుతాయని ప్రశ్నించారు. నాకో న్యాయం వారికి మరో న్యాయమా అనే రీతిలో ఆమె వ్యాఖ్యలు చేశారు. తనపై చర్యలు తీసుకునే ముందు ఇతరులపై వచ్చిన ఆరోపణలను కూడా పరిశీలించాలని కోరారు. కేబినెట్‌లో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అసంతృప్తితో ఉన్నారని కూడా సురేఖ పేర్కొన్నారు.

# దేవరకద్ర డీఆర్‌డీఎల్‌కు ఉచితంగా భూమి కేటాయించండి

యువ శాస్త్రవేత్తలు పాల్గొనే డిఫెన్స్ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రిగా తమరు హాజరై మార్గనిర్దేశం చేస్తే, ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో–2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రక్షణ ఎక్స్‌పో–2026ను విజయవంతంగా నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రిని కోరారు. సైనిక, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

### ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు మరో 750 ఎకరాలు ఇస్తాం

హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్డీఎల్ ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కి ముఖ్యమంత్రి వివరించారు. రక్షణ శాఖ కోరినట్లు మొత్తం 1500 ఎకరాలు కోరినందున మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### దేవరకద్రలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమి కేటాయింపు

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ. 1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని చెప్పారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేష్ కుమార్ షెట్కార్, పోరిక బలరాం నాయక్ , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

### మద్రాస్ రెజిమెంట్ చోరీపై వివరణ.?

సికింద్రాబాద్ బొల్లారంలోని బెటాలియన్ 20 మద్రాస్ రెజిమెంట్ ఆర్మరీలో ఆయుధాల చోరీ ఘటనకు సంబంధించి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. రక్షణ శాఖ ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రక్షణ మంత్రిని కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.రాష్ట్ర హోమ్ శాఖ మంత్రిగా కూడా రేవంత్ ప్రతినిత్యం వహిస్తున్న నేపథ్యంలో స్వయంగా వెళ్లి కలిసి వివరణ ఇచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ భేటీ పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

తమిళనాడు అసెంబ్లీలో
సీఎం విజయ్ కీలక ప్రకటనలు

హామీ ఇచ్చారు.దీంతో పాటు రూ. 4,800 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టులను అసెంబ్లీ వేదికగా ప్రకటించారాయన. చెన్నై ఉత్తర ప్రాంతం, ఆవడి, పొన్నేరి ప్రాంతాల అవసరాల కోసం మింజూరులో 400 ఎంఎల్‌డీ సామర్థ్యంతో డీశాలినేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆవడి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ఇళ్లకు 24 గంటలూ తాగునీటిని అందించడానికి రూ. 500 కోట్లతో కొత్త పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. మదురై, కడలూరు సహా పలు మున్సిపాలిటీలు, పంచాయతీల్లో నీటి సదుపాయాల కల్పనకు రూ. 1,000 కోట్లను తమిళనాడు ప్రభుత్వం కేటాయించింది. చెన్నై కీల్పాక్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచేందుకు రూ. 410 కోట్లతో మరో ప్రాజెక్టు చేపట్టనున్నారు. వీటితో పాటు తిరునెల్వేలి, సేలం ప్రాంతాలలో చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణ అంచనా వ్యయం దాదాపు రూ. 547 కోట్లు. సెప్టెంబర్ 15 నుంచి డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లను డిజిటలైజ్ చేయనున్నట్లు విజయ్ తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారితమైన ఈ డాక్యుమెంట్లను స్మార్ట్‌ఫోన్ల ద్వారా సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇకపై డ్రైవింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వెంటనే డిజిటల్ లైసెన్స్ అందించేలా విధివిధానాలు రూపొందిస్తోన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ, వాహనాల రిజిస్ట్రేషన్ ఇక నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా చేసుకునేలా మార్పులు తీసుకురానున్నారు.

# కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను

తనకు పదవులపై వ్యక్తిగత ఆశ లేదని చెబుతూనే రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.సమయం వచ్చినప్పుడు దేవుడి దయతో వచ్చే పదవులను ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. తాను భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతాననే ధీమాను వ్యక్తం చేసిన ఆయన ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా తనను ఆపలేడని వ్యాఖ్యానించారు. తనకు ఏ పదవి వచ్చినా అది వ్యక్తిగత గౌరవంగా భావించబోనని సామాన్యుడికి దక్కిన బాధ్యతగా భావిస్తానని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన రాజకీయ లక్ష్యమని పేర్కొన్నారు. పదవిని కిరీటంగా కాకుండా బాధ్యతగా భావిస్తానన్నారు.ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతున్న నాయకులపై కూడా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నుంచి నాయకులను ఆహ్వానించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని పేర్కొంటూనే కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న అసలు కార్యకర్తలను పక్కనబెట్టి పార్టీని తమ ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే వెళ్లగొడతామంటే బాగుండదు అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి అధికారం రావడం కోసం 10 ఏళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణ కాంగ్రెస్‌ను కొందరు తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని సంచలన ఆరోపణలు గుప్పించిన రాజగోపాల్‌రెడ్డి తాను ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీని ఎవరూ కబ్జా చేయలేరని తేల్చి చెప్పారు. మునుగోడులోనే కాకుండా తెలంగాణలోని అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని వారికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు. తాను ప్రజా సమస్యలపైనే పోరాడుతున్నానని, పదవుల కోసం కాదని స్పష్టం చేశారు.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనకు రాజకీయ స్ఫూర్తి అని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో వైఎస్ఆర్‌కు ఇప్పటికీ లక్షలాది మంది అభిమానులు ఉన్నారని గుర్తు చేశారు. వైఎస్ఆర్ ఆశయాల కోసం పనిచేస్తానని ఆయన పాలనలో పేదలకు అందిన సంక్షేమం, అభివృద్ధిని ప్రస్తావిస్తూ మళ్లీ రాజశేఖర్‌రెడ్డి యుగం రావాలని ఆకాంక్షించారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలన్నదే తన ఆలోచన అని చెప్పారు. ఇచ్చిన హామీల అమలు, అవినీతికి వ్యతిరేకంగా, పేదలకు అండగా ఉండేందుకు తాను పోరాడతానన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

# కేపీహెచ్‌బీలో గజం రూ.2.70 లక్షలు

చదరపు గజానికి కనీస ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించారు. అయితే ప్లాట్లను దక్కించుకునేందుకు బిడ్డర్లు పోటీ పడటంతో ధరలు గణనీయంగా పెరిగాయి. వేలంలో ఒక ప్లాట్ చదరపు గజం రూ.2.70 లక్షలకు అమ్ముడైంది. మరో ప్లాట్‌కు గజం రూ.2.36 లక్షల ధర పలికింది. మరో 2 ప్లాట్లు చదరపు గజం రూ.2.06 లక్షల చొప్పున విక్రయం అయ్యాయి. దీంతో కేపీహెచ్‌బీ ప్రాంతంలో భూములకు ఉన్న డిమాండ్ మరోసారి స్పష్టమైంది.ఈ బహిరంగ వేలంలో మొత్తం 19 మంది బిడ్డర్లు పాల్గొన్నారు. తమకు నచ్చిన ప్లాట్లను దక్కించుకునేందుకు వారు పోటీపడటంతో పలు ప్లాట్లు హౌసింగ్ బోర్డు నిర్ణయించిన కనీస ధర కంటే అధిక మొత్తానికి అమ్ముడయ్యాయి. వేలం పూర్తి అయ్యే సమయానికి 16 ప్లాట్లకు కలిపి చదరపు గజం సగటు ధర సుమారు రూ.1.79 లక్షలుగా నమోదైంది. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరింది.హైదరాబాద్‌లో కేపీహెచ్‌బీ ప్రాంతానికి ఇప్పటికే ప్రత్యేకమైన రియల్ ఎస్టేట్ గుర్తింపు ఉంది. నగరంలోని ప్రధాన ఐటీ, వాణిజ్య ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, మెట్రో సహా రవాణా సదుపాయాలు, నివాస ప్రాంతంగా ఉన్న డిమాండ్ వంటి అంశాలు ఈ ప్రాంతంలో భూములకు విలువ పెరగడానికి కారణాలుగా కనిపిస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా వివాదాలు లేని, అభివృద్ధి చెందిన లేఅవుట్లలోని ప్లాట్లకు కొనుగోలుదారుల నుంచి ఎక్కువ ఆసక్తి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని హౌసింగ్ బోర్డు నిర్వహించిన వేలంలో కూడా బిడ్డర్లు భారీగా ధరలు చెల్లించేందుకు ముందుకు రావడం ఆసక్తికరంగా మారింది.ఇక ఈ భూముల వేలం ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. వేలానికి ముందు ఆగస్ట్ 10వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. కేపీహెచ్‌బీ ప్లాట్లకు కొనుగోలుదారుల నుంచి ఇప్పటికీ భారీ డిమాండ్ ఉందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతం పేర్కొన్నారు. తాజా వేలం ఫలితాలు ఈ విషయాన్ని మరోసారి రుజువు చేశాయని తెలిపారు. బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు వచ్చిన ఆదాయం సంస్థ ఆర్థిక వనరులను పెంచడంలో ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మార్కెట్ ఎంత వేగంగా మారుతుందో కేపీహెచ్‌బీ వేలం మరోసారి చూపించింది. గజం రూ.1.60 లక్షల కనీస ధరతో ప్రారంభమైన బిడ్డింగ్ ఏకంగా రూ.2.70 లక్షలకు చేరడం విశేషం. అంటే నిర్ణయించిన కనీస ధరతో పోలిస్తే గరిష్ఠ ధర భారీగా పెరిగింది. ఐటీ కారిడార్లు, మౌలిక వసతుల అభివృద్ధి, మెరుగైన కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో భూములకు డిమాండ్ కొనసాగుతున్న నేపథ్యంలో కేపీహెచ్‌బీ వేలం ఫలితాలు నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి.

# తెలంగాణపై దరిద్రం దండయాత్ర

అని చెప్పి, వెయ్యి రోజులు నరకం చూపించారు. సచివాలయ ఉద్యోగులు చేస్తున్న నిరసనే, రేవంత్ పాలన తీరుకు ఉదాహరణ" అని విమర్శించారు.

### 1000 రోజుల్లో దరిద్రం దండయాత్ర

పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకొంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధి పనులు చేయకున్నా, రాష్ట్రాన్ని రూ.4.50 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారన్నారు. రూ.50 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని, రూ.20వేల కోట్లు మాత్రమే చేశారన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారన్నారు. రుణ మాఫీ చేయకుండానే 70 శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారని మండిపడ్డారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి 1000 రోజులు అయిందని విమర్శించారు.

### చంద్రబాబుకు చెంచాగిరి

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ఢిల్లీకి మూటలు, పదవుల కోసం కీచులాటలుగా ఉందని ఘాటు విమర్శలు చేశారు కేటీఆర్. రైతు బంధు బంద్ అయి, రాహుల్ బంధు మొదలైందని ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే ఎవరినీ వదిలిపెట్టమన్నారు.ఒ

కాళేశ్వరం మీద కక్షకట్టి, రైతులను శిక్షిస్తున్నారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు చెంచాగిరి చేయడమే సీఎం రేవంత్‌కు తెలుసని కేసీఆర్ విమర్శిచారు. గురు దక్షిణగా గోదావరి నీళ్లు సంతర్పణ చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉద్యమ బిడ్డ విద్యాసాగర్‌ను సలహాదారుగా పెట్టుకుంటే, రేవంత్ రెడ్డి, చంద్రబాబు మోచేతి నీళ్లు తాగే ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా పెట్టుకున్నారని ఘాటు విమర్శలు చేశారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సి కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తారని కేటీఆర్ విమర్శలు చేశారు. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు లేవంటున్నారన్నారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, జాబ్ క్యాలెండర్ పేరిట జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేసిందన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం

విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్–1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు. కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.

# జనసేన యువజన విభాగానికి 'జై కొట్టు'గా నామకరణం

పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ యువజన విభాగం లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంతో పిఠాపురం జనసేన శ్రేణుల నినాదాలతో మార్మోగిపోయింది. ఈ సందర్భంగా వేలాది బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. 'జై జనసేన', 'జై పవన్ కల్యాణ్' నినాదాలతో పట్టణ వీధులు దద్దరిల్లాయి. ఈ కార్యక్రమానికి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన ఆడియో సందేశాన్ని పంపారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యల కారణంగా పవన్ కల్యాణ్ పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేకపోతున్నారని, అయినప్పటికీ ఆయన ఆలోచనలు ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం చుట్టూనే ఉంటాయని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

అనంతరం నాదెండ్ల మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కూటమి విజయంలో జనసేన పార్టీ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. "నిరంకుశ జగన్‌ను ఓడించి, ప్రజల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో మనమందరం సఫలమయ్యాం" అని అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా యువత పార్టీని ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలకు వేదికగా నిలిచింది. నాదెండ్ల మనోహర్ కేక్ కట్ చేసి, పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక గీతాలు, ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శన ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువతను పార్టీలో మరింత క్రియాశీలం చేసే లక్ష్యంతో 'జై కొట్టు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి

పెగడపల్లి (ధర్మపురి) ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని పెగడపల్లి గ్రామ సర్పంచ్ ఒరుగల అరుణ – శ్రీనివాస్ గ్రామ ప్రజలకు తెలిపారు. పెగడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచ్ ఒరుగల అరుణ – శ్రీనివాస్ ఆధ్వర్యంలో విబిజి – రామ్ – జి పథకంలో భాగంగా నూతన పనుల ఎంపికకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో ఉప సర్పంచ్ బత్తుల ప్రదీప్, గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు మక్కపెల్లి మల్లేశం, నంది మహిపాల్, ఒరుగల అంజమ్మ – కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, గ్రామ పంచాయతి సిబ్బంది, గ్రామ స్థాయి ఉద్యోగులు, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు మల్లేపల్లి ఓసీలో

# కేబుల్ చోరీకి బ్రేక్

**- చోరీ కేబుల్‌ను తరలిస్తుండగా స్పెషల్ టీం దాడి..**

**- పోలీసులకు అప్పగింత**



**భద్రాద్రి కొత్తగూడెం** మణుగూరు మల్లేపల్లి ఓసీ డంపర్ షెడ్‌లో కేబుల్ చోరీకి పాల్పడిన దొంగలపై సింగరేణి సెక్యూరిటీ విభాగం స్పెషల్ టీం, ఇంటెలిజెన్స్ టీం సంయుక్తంగా చర్యలు చేపట్టింది. జూనియర్ ఇన్స్పెక్టర్ బందెల విజేందర్ నేతృత్వంలో చురుగ్గా వ్యవహరించిన సిబ్బంది చోరీకి గురైన కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు.మంగళవారం రాత్రి సుమారు 9.25 గంటల సమయంలో మల్లేపల్లి ఓసీ డంపర్ షెడ్ నుంచి సుమారు 50 మీటర్ల 35 రాఖిఓఓ ఆర్మర్డ్ కేబుల్ చోరీకి గురైనట్లు సమాచారం అందింది. చోరీ చేసిన కేబుల్‌ను మల్లేపల్లి చెరువు కట్ట సమీపంలో దొంగలు ఒలుస్తుండగా, సమాచారం అందుకున్న సెక్యూరిటీ డిపార్ట్మెంట్ స్పెషల్ టీం అక్కడికి చేరుకుంది.స్పెషల్ టీం రాకను గమనించిన దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే చోరీ చేసిన కేబుల్‌ను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. జూనియర్ ఇన్స్పెక్టర్ బందెల విజేందర్ స్వయంగా కేబుల్‌ను తీసుకువచ్చి మల్లేపల్లి ఓసీ డంపర్ షెడ్‌లో భద్రపరిచారు.అనంతరం దొంగతనానికి సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించి మణుగూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.చోరీ ఘటనపై వేగంగా స్పందించి, సమాచారం సేకరించి, దొంగలను గుర్తించి పోలీసులకు అప్పగించడంలో సెక్యూరిటీ డిపార్ట్మెంట్ స్పెషల్ టీం, ఇంటెలిజెన్స్ టీం కీలక పాత్ర పోషించాయి. జూనియర్ ఇన్స్పెక్టర్ బందెల విజేందర్ నేతృత్వంలో సిబ్బంది సమన్వయంతో వ్యవహరించడంతో చోరీకి గురైన విలువైన కేబుల్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడం సాధ్యమైంది.సింగరేణి ఆస్తుల పరిరక్షణలో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా పనిచేస్తున్నారనే దానికి ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.

## ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు




**గోదావరిఖని :** స్థానిక కళ్యాణ్ నగర్ లోని అజయ్ డెంటల్ హాస్పిటల్ లో డాక్టర్ అజయ్ ఆధ్వర్యంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన పురస్కరించుకొని పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 55వ జన్మదినం కేకును కట్ చేసి సీట్ల పంపిణీ నిర్వహించడం జరిగింది జరిగింది అనంతరం డాక్టర్ అజయ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా ఈరోజు దంత సమస్యలు ఉన్నవారికి ఉచితంగా ట్రీట్మెంట్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... చాలా సంవత్సరాలుగా ప్రాంతంలో అభిమానులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారు ఇక పెద్ద మొత్తంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ అభిమానులకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు కార్పొరేటర్ గట్ల రమేష్, నెల కంటి రాము, ఫ్యాన్స్ కో ఆర్గనైజర్ గాంధీ, రోడ్డ శ్రీనివాస్, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసారపు రాకేష్, గుండబోయిన అర్జున్ కుమార్, గుండబోయిన అజయ్ కుమార్, మెరిమిడి రాకేష్, ప్రశాంత్, సంజయ్, సంతోష్, అంజి, వినయ్, వెంకటేష్, కృష్ణ, దాముక పవన్, దినేష్, తదితరులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా వ్యతిరేక పాలన

**- బీజేపీ నేతల ధ్వజం**




**గోదావరిఖని :**కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల ప్రజా వ్యతిరేక పాలనపై బీజేపీ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జనగామ మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలన "దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు" లాగా మారిందని, "చారాన కోడికి బారాన మసాలా" లాగా ప్రచారం ఎక్కువగా, ఆచరణ తక్కువగా ఉందని అన్నారు. "పేరు గొప్ప ? ఊరు దిబ్బ" అన్నట్టుగా కాంగ్రెస్ పాలన ఉందని ఎద్దేవా చేశారు.ప్రజలను రక్షించాల్సిన ప్రభుత్వం రక్షక పాలన కాకుండా రాక్షస పాలనగా మారిందని సంధ్యారాణి విమర్శించారు. వెయ్యి రోజుల్లో స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.పేదల ఇళ్లను కూల్చడం, దేవాలయాలను తొలగించడం, చెట్లను నరికివేయడం వంటి చర్యలతో ప్రభుత్వం ప్రజల ఆవేదనను పట్టించుకోవడం లేదని అన్నారు. "పాము తన పిల్లలను తానే తిన్నట్టుగా, కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా" కాంగ్రెస్ పాలన పరిస్థితి తయారైందని వ్యాఖ్యానించారు.మోడీ పాలన అంటే దేశ ప్రజలకు శ్రీరామరక్ష అని, హనుమాన్ గుడి లేని ఊరు లేదని, మోడీ పథకం లేని ఇల్లు లేదని కందుల సంధ్యారాణి అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా దేశ ప్రజలకు నిరంతరం

# దళిత ద్రోహి రేవంత్ రెడ్డి ప్రభుత్వం

**- ఎస్సీల హక్కులపై నిర్లక్ష్యం.. - మహనీయుల అవమానాన్ని సహించం**

**- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు**



**తాండూర్:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు తీవ్రస్థాయిలో విమర్శించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం తాండూర్ మండలం మాదారం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రేవంత్ రెడ్డి చిత్రంతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్ర కార్యాలయంపై, సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటంపై నలుపు రంగు చల్లి అవమానించడం అత్యంత బాధాకరమైన ఘటన అని అన్నారు. ఇది ఎస్సీ సమాజం మనోభావాలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. రాజకీయ భేదాలు ఉండొచ్చని, అయితే మహనీయుల చిత్రాలను అవమానించడం మాత్రం ఏ విధంగానూ సమర్థనీయం కాదన్నారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటాన్ని అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్సీ సమాజం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడటం లేదని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలే తమ ప్రధాన డిమాండ్ అని శ్రీకృష్ణ దేవరాయలు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎస్సీ సమాజానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తు చేసుకోవాలని అన్నారు.ఎస్సీ డిక్లరేషన్‌లో ప్రకటించిన ప్రతి హామీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏ హామీ అమలైంది? ఏది అమలు కాలేదు? ఎంత నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? అనే పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు.విద్య, ఉద్యోగాలు, గృహాలు, భూమి, ఆర్థిక సాధికారత, సంక్షేమ పథకాల విషయంలో ఎస్సీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను కాగితాలకే పరిమితం చేయకుండా స్పష్టమైన కార్యాచరణ, కాలపరిమితితో అమలు చేయాలని అన్నారు.ఎస్సీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి రాకూడదన్నారు.విద్యే ఎస్సీ సమాజం అభివృద్ధికి ప్రధాన మార్గమని, అందువల్ల విద్యకు సంబంధించిన హామీలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని డిమాండ్ చేశారు.సంత్ రవిదాస్ మహారాజ్‌ను అవమానించడం అంటే ఆయన చూపిన సమానత్వ మార్గాన్ని అవమానించడమేనని శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఎస్సీ సమాజం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో తన ఆత్మగౌరవం కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఎస్సీ సమాజం ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక, కాలపరిమితిని ప్రకటించాలని కోరారు. ఎస్సీ సమాజానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కార్యదర్శి గాదె రాజేశం, మండల నాయకులు ఆవుల చందు, ఆనంద్, త్రినాథ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు ధర్నాలు చేసే నైతిక హక్కు లేదు

**- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**కరీంనగర్** పదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనపై ధర్నాలు చేయడం సిగ్గుచేటని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ముకరంపురలోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధికారిక క్యాంపు కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తొలగించకపోతే పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన మోసాలు, వైఫల్యాలపై నగరంలోని కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారో, ఎంతమంది దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను స్వయంగా లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పథకాలు అమలు కావడం లేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, అది చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ధర్నాలకు దిగుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ హద్దులు దాటి మాట్లాడుతున్నారని, తన భాషా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌తో వ్యక్తి ప్రాణాలు కాపాడిన వైద్య దంపతులు




**మంచిర్యాల :**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ పరిధిలోని గర్మిళ్ల ప్రాంతంలో మల్లేష్ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా ఆకస్మికంగా గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయారు అదే సమయంలో ఆయన వెనుక కారులో వస్తున్న వైద్య దంపతులు డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, డాక్టర్ సునీత వెంటనే స్పందించి సీపీఆర్ చేసి మల్లేష్ ప్రాణాలను కాపాడారు.సకాలంలో స్పందించి నిండు ప్రాణాన్ని నిలబెట్టిన వైద్య దంపతుల మానవత్వం చాలా గొప్పదని అందరు ప్రశంశించారు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ఎంత కీలకమో సమాజానికి తెలియజేసిన సంఘటనగా ఇది నిలిచింది.ఈ సందర్భంగా వైద్య దంపతులను బీజేపీ కార్పొరేటర్లు ముఖేష్ గౌడ్ కస్తూరి నాగరాజు బోట్ల అనిత సత్యం అభినందించి ఘనంగా సత్కరించారు.

## ఆపరేషన్ సింధూర్ కమాండర్‌కు అయోధ్య బాధ్యత

అయోధ్య (ప్రశ్న న్యూస్) అయోధ్య రామ మందిరం పరిపాలనకు తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జీతేంద్ర మిశ్రాను నియమించే అవకాశం ఉంది. 5 వేల మందికి పైగా దరఖాస్తుదారుల నుంచి ఆయన్ను ఎంపిక చేసినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భారత వైమానిక దళంలో పలు కీలక కమాండ్ బాధ్యతలు నిర్వహించిన జీతేంద్ర మిశ్రా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో వెస్ట్రన్ కమాండ్ చీఫ్‌గా పనిచేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ భేటీలో 12 అంశాలపై చర్చించనున్నారు. ఇందులో రామ మందిరానికి తొలి సీఈఓ నియామకం ప్రధాన అంశంగా ఉంది. సీఈఓకు విస్తృత పరిపాలనా అధికారాలు కల్పించేలా ట్రస్ట్ డీడ్‌లో మార్పులు చేయాలని కూడా నిర్ణయించే అవకాశం ఉంది.2020 ఫిబ్రవరి 5న ట్రస్ట్ ఏర్పాటైన తర్వాత డీడ్‌లో మార్పులు చేయడం ఇదే తొలిసారి కానుంది. మందిరంలో విరాళాల అక్రమాల ఆరోపణలు, సమర్పణల నగదు మాయం వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ట్రస్ట్ నిర్వహిస్తున్న మూడో సమావేశం ఇది. ఈ వ్యవహారం నేపథ్యంలో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. మందిరం పరిపాలనను మరింత ప్రొఫెషనల్‌గా, పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి సీఈఓ అవసరమని రామ మందిర నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా గతంలో పేర్కొన్నారు. సీఈఓ ప్రభుత్వ జోక్యం లేకుండా పనిచేస్తారని, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శికి నివేదిస్తారని సమాచారం.సీఈఓకు చట్టపరమైన, పరిపాలనా, ఆర్థిక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. సంస్థకు అవసరమైన విధానాలు, వ్యవస్థలు, నిర్వహణ పద్ధతులను రూపొందించడం, ట్రస్ట్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, చట్టపరమైన నిబంధనలను పాటించేలా చూడటం వంటి బాధ్యతలు కూడా ఆయన పరిధిలోకి రానున్నాయి. సంస్థ భవిష్యత్ అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణలో సీఈఓ అత్యున్నత కార్యనిర్వాహక అధికారిగా వ్యవహరించనున్నారు.మందిర భద్రత కోసం శాశ్వత స్థానిక భద్రతా సమన్వయ కమిటీ ఏర్పాటు అంశం కూడా సమావేశం అజెండాలో ఉంది. ట్రస్ట్‌కు అధికారిక మీడియా ప్రతినిధిని నియమించే అంశంపైనా చర్చించనున్నారు. విరాళాల అక్రమాల ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పురోగతిని కూడా ట్రస్ట్ సమీక్షించనుంది. ఈ కేసుకు సంబంధించిన సుప్రీంకోర్టు విచారణ స్థితిపైనా చర్చ జరగనుంది. విరాళాల అక్రమాల ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేసిన మరుసటి రోజు, జూన్ 26న చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేశారు. తొలి సీఈఓ నియామకం, ట్రస్ట్ డీడ్‌లో మార్పులతో రామ మందిర పరిపాలనలో కొత్త విధానాలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది.

## రాజముద్రతో కూడిన పట్టాదారు

# పాసుపుస్తకాలు పంపిణీ




తుగ్గలి: రీ సర్వే అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రాజముద్రతో ప్రచురించిన రైతుల పట్టాదారు పాసుపుస్తకాలను టిడిపి నాయకులు,అధికారులు రైతులకు పంపిణీ చేశారు.తుగ్గలి మండల పరిధిలోని గల పగిడిరాయి గ్రామ సచివాలయం నందు నూతనంగా మంజూరైన రైతు పట్టాదారు పాసుపుస్తకాలు గ్రామ టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం రోజున రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన రైతు పట్టాదారు పాసుపుస్తకం నందు రైతుకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు,పొలం విస్తీర్ణం,పొలం యొక్క మ్యాప్ కూడా పాసు పుస్తకం నందు అందుబాటులో ఉంటుందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు నాగేంద్ర,రంగన్న, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ రాజు నాయక్,డీలర్ సుంకన్న, సచివాలయ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ లో భారీ జూదం, మద్యం దందా గుట్టురట్టు

**- 9 మంది అరెస్ట్**




బద్వేలు బద్వేల్ టౌన్ పరిధిలోని రామాంజనేయ నగర్, తెలుగు గంగ బాటరీ రోడ్డులోని ఇంటి నెంబర్ 8-1-406 నందు హైటెక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మోసపూరితంగా మంగతాయ ఆడుతూ, అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచి విక్రయిస్తున్న 9 మంది సభ్యుల ముఠాను బద్వేల్ అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. 01.09.2026వ తేదీ సాయంత్రం 04.00 గంటలకు వచ్చిన సమాచారం మేరకు బద్వేల్ అర్బన్ సబ్ ఇన్స్పెక్టర్ జయరాములు, ఎస్సై రంగారావు తమ సిబ్బందితో కలిసి సదరు ఇంటిపై దాడి చేశారు. నిందితులు కుట్రతో నిండి తెప్పించిన ఆన్లైన్ ద్వారా కొనుగోలు చేసిన ఎలక్ట్రానిక్ స్కానింగ్ డివైజ్ లు (ఐఫోన్ మోడల్), బ్లూటూత్ పరికరాలు, డిజిటల్ ఇయర్ ఫోన్లు ఉపయోగించి ప్రత్యక్షమైన పేక ముక్కలను ముందుగానే స్కాన్ చేసేవారు. జూదానికి సంబంధించిన అన్ని వివరాలు బద్వేలు అర్బన్ సీఐ రామకృష్ణ తెలిపారు

## కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన

**- ప్రజల సంక్షేమంలో ముందడుగు**

**జి.హరి ప్రసాద్ యాదవ్(టిడిపి మండల ప్రధాన కార్యదర్శి)**

పాములపాడు(సెప్టెంబర్ రెండవ తేదీన నంద్యాల జిల్లాపాములపాడు మండలంలోని, మిట్టకందాల గ్రామంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఢ మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు.ఈ మాజీ సర్పంచ్ ఢ టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జి.హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు తీరును, ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ 205వ బూత్ ఇన్‌చార్జి లింగాల శివరాముడు, తెలుగుదేశం నాయకులు నియాజ్, వి.మధు, లింగాల దేవరాజ్, సుబ్బారాయుడు, డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వై ఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**- వై ఎస్సార్ సేవలు చిరస్మరణీయం**

**- రాహుల్ గాంధీపై ఎప్ ఐ ఆర్ ఉపసంహరణకు కాంగ్రెస్ డిమాండ్**



**మేడ్చల్ ( ప్రశ్నన్యూస్ )** మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ పరిధిలోని మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### పేదల సంక్షేమానికి వైఎస్సార్ కృషి

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సామాన్య ప్రజల జీవితాల్లో మార్పుకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.

### రాహుల్ గాంధీపై ఎఫ్ ఐ ఆర్ ఉపసంహరించాలి

వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం అనంతరం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదైన ఎఫ్ ఐ ఆర్ ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతును అణిచివేసేందుకు కేసులు, ఎఫ్ ఐ ఆర్ లను ఉపయోగించడం సరికాదన్నారు. రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో, దురుద్దేశపూర్వకంగా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారని కాంగ్రెస్ పార్టీ భావిస్తోందన్నారు."రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ ఐ ఆర్ ను వెంటనే ఉపసంహరించాలి. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై సమానంగా చర్యలు తీసుకోవాలి. బీజేపీ కార్యకర్తలపై కూడా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలి. చట్టం అందరికీ సమానమేనని ప్రభుత్వాలు నిరూపించాలి" అని వజ్రేష్ యాదవ్ డిమాండ్ చేశారు.అనంతరం ఉత్తరాఖండ్ ఘటనకు సంబంధించి మేడ్చల్ సీఐకి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, డీసీసీ జిల్లా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, వైఎస్సార్ అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లాలో బస్సుకు తప్పిన

# ఘోర ప్రమాదం



**కరీంనగర్** కరీంనగర్ లో ఆర్టీసీ బస్సుకు ఘోర ప్రమాదం తప్పింది. చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ శివారులో వ్యవసాయ బావిపైకి దూసుకెళ్లింది. కరీంనగర్ నుంచి హుస్నాబాద్కు ప్రయాణికులతో వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. భారీ ప్రమాదం తృటిలో తప్పింది. ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

# అనకాపల్లికి గోదావరి జలాలు

**- పాయకరావుపేట వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు**

**అనకాపల్లి** పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు నీరు ఇస్తున్నందుకు సూచికగా పాయకరావుపేట వద్ద శిలాఫలకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ? మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగల పూడి అనిత, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఎడమ కాలువ నుంచి అనకాపల్లి జిల్లా వరకూ వచ్చిన గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జల హారతి ఇచ్చారు. పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేసారు. ఎడమ కాల్వ ద్వారా విడిచే నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాఉ. ఎడమ కాలువ నిర్మాణానికి రూ.4,192 కోట్ల ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం చేసింది. ఎడమ కాలువ ద్వారా వచ్చిన నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జల వనరుల శాఖ ప్రణాళిక. గోదావరి జలాలతో పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరహా, మామిడి గెడ్డ ఆయకట్టు పరిధిలో ఉన్న 46,620 ఎకరాల స్థిరీకరణ అమలవుతోంది. 23.44 టీఎంసీల గోదావరి జలాలతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక అవసరాలకు, తాగు, సాగునీటికి నీరు ఇచ్చేలా ప్రణాళిక. చంద్రబాబు, కూటమి ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి శిలా ఫలకం వద్ద ఫోటోలు దిగారు. అధికారులు, ప్రజా ప్రతినిధులను స్వయానా పిలిచి శిలాఫలకం వద్ద అందరితోనూ ఫోటోలు దిగారు. ముఖ్యమంత్రికి సాంప్రదాయ కోలాటంతో స్వాగతం లభించింది.

# నకిలీ స్థిరాస్తి పత్రాల కేసుల్లో అప్పటి కీసర సబ్-రిజిస్ట్రార్ అరెస్ట్

**- 11 మోసపూరిత గృహ రుణాల ద్వారా రూ.4.11 కోట్ల మోసం జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి**

**- పలు స్థిరాస్తి మోసం కేసుల్లో ఏ9గా ఉన్న మహమ్మద్ యూసుఫ్-ఉర్-రహ్మాన్**

**- ఏడు క్రైం కేసుల్లో అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరు.. జ్యుడీషియల్ కస్టడీకి తరలింపు**






**కీసర( ప్రశ్న న్యూస్)** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు స్థిరాస్తి మోసం, నకిలీ పత్రాలు, మోసపూరిత రిజిస్ట్రేషన్ కేసుల దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నకిలీ, కల్పిత మరియు తారుమారు చేసిన స్థిరాస్తి పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి కీసర సబ్-రిజిస్ట్రార్, కీసర ఎస్ఆర్‌వోకు చెందిన ఏ9 మహమ్మద్ యూసుఫ్-ఉర్-రహ్మాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.కీసర పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నెం.723/2021, 195/2023, 241/2025, 419/2025, 714/2025, 928/2025, 84/2026 తదితర కేసుల దర్యాప్తులో ఆయన పాత్రపై కీలక ఆధారాలు లభించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుల్లో నకిలీ స్థిరాస్తి పత్రాలు, తప్పుడు లింక్ డాక్యుమెంట్లు, ఇంపర్సనేషన్, జిపిఏ/ ఏ జీపీఏ పత్రాలు తదితరాలను ఉపయోగించి మోసపూరిత రిజిస్ట్రేషన్లు జరిపినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.

### రూ.4.11 కోట్ల గృహ రుణాల మోసం

క్రైం నెం.928/2025 దర్యాప్తులో వ్యవస్థీకృత స్థాయిలో గృహ రుణాల మోసం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులను రుణగ్రహీతలుగా వినియోగించి, వారి పేర్లపై నకిలీ లేదా తారుమారు చేసిన స్థిరాస్తి పత్రాలను సృష్టించి వివిధ బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఇప్పటివరకు 11 మోసపూరిత గృహ రుణాల లావాదేవీల ద్వారా సుమారు రూ.4.11 కోట్లను మోసపూరితంగా పొందినట్లు పోలీసులు గుర్తించారు.

### కీసర ఎస్ఆర్‌వోలో జరిగిన పలు రిజిస్ట్రేషన్లపై దర్యాప్తు

దర్యాప్తులో భాగంగా కీసర సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన పలు వివాదాస్పద రిజిస్ట్రేషన్లను పోలీసులు పరిశీలించారు. ముఖ్యంగా 2021, 2022 సంవత్సరాల్లో నమోదైన కొన్ని సేల్ డీడ్‌లను నిందితులు తరువాత బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల వద్ద టైటిల్, సెక్యూరిటీ పత్రాలుగా ఉపయోగించి గృహ రుణాలు పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది.రిజిస్ట్రేషన్ రికార్డులు, వివాదాస్పద సేల్ డీడ్లు, జిపిఏ/ఏ జీపీఏ పత్రాలు, థంబ్ ఇంప్రెషన్లు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర నిందితుల వెల్లడింపులు తదితర ఆధారాల ఆధారంగా అప్పటి సబ్-రిజిస్ట్రార్ పాత్రపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### సెప్టెంబర్ 1న అరెస్ట్

ఏ9 మహమ్మద్ యూసుఫ్-ఉర్-రహ్మాన్ పాత్రకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి రావడంతో సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం చట్టప్రకారం అరెస్ట్ చేసి సంబంధిత కేసుల్లో గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి నివాసంలో నిర్వహించిన తనిఖీల్లో సంబంధిత రిజిస్ట్రేషన్ పత్రాల ప్రతులు, ఇతర కీలక డాక్యుమెంటరీ ఆధారాలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

### ఈఎంఐ లు చెల్లిస్తూ బ్యాంకులను నమ్మించే ప్రయత్నం

మోసం వెలుగులోకి రాకుండా రుణాలు మంజూరైన తర్వాత కొంతకాలం ఈఎంఐ లు చెల్లించి, అనంతరం ఉద్దేశపూర్వకంగా చెల్లింపులు నిలిపివేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. బ్యాంకులు డిఫాల్ట్ నోటీసులు జారీ చేసి సంబంధిత ఆస్తులను పరిశీలించిన సమయంలో కొన్ని ఆస్తులు వాస్తవంగా ఉనికిలో లేకపోవడం, సర్వే నెంబర్లు, ప్లాట్ నెంబర్లు, ఇతర వివరాలను తారుమారు చేయడం, నకిలీ లింక్ డాక్యుమెంట్లు వినియోగించడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

### డిజిటల్, బయోమెట్రిక్ ఆధారాల పరిశీలన

ప్రస్తుతం కీసర ఎస్ఆర్‌వోలోని ఒరిజినల్ రిజిస్ట్రేషన్ రికార్డులు, వివాదాస్పద సేల్ డీడ్లు, జి పి ఏ / ఏ జి పి ఏ పత్రాలు, థంబ్ ఇంప్రెషన్, బయోమెట్రిక్ రికార్డులు, ఫోటోలు, బ్యాంకు లోన్ ఫైళ్లు, టైటిల్ వెరిఫికేషన్ నివేదికలు, మార్టేజ్ పత్రాలు, కేవైసీ వివరాలు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.అలాగే ఏ9తో పాటు ఇతర నిందితుల మధ్య జరిగిన కమ్యూనికేషన్లు, ఆర్థిక లావాదేవీలు, సంబంధాలను నిర్ధారించేందుకు డిజిటల్, ఎలక్ట్రానిక్ ఆధారాలను కూడా చట్టపరమైన విధానంలో సేకరించి విశ్లేషిస్తున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని, నేరం ద్వారా వచ్చిన డబ్బు, ఆస్తులను గుర్తించడంతో పాటు మరిన్ని మోసపూరిత లావాదేవీలు జరిగాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

### ప్రజలకు కీసర పోలీసుల హెచ్చరిక

స్థిరాస్తి కొనుగోలు, రిజిస్ట్రేషన్ లేదా గృహ రుణాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీసర పోలీసులు సూచించారు. ఆస్తి టైటిల్, లింక్ డాక్యుమెంట్లు, సర్వే నెంబర్లు, ప్లాట్ నెంబర్లు తదితర వివరాలను రెవెన్యూ రికార్డులు, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, సంబంధిత బ్యాంకులు లేదా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల ద్వారా తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలియని వ్యక్తుల మాటలు నమ్మి తమ పేర్లపై రుణాలు తీసుకోవద్దని, నకిలీ పత్రాలు లేదా అనుమానాస్పద స్థిరాస్తి లావాదేవీలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కేసుల దర్యాప్తు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతీ, ఐపీఎస్ పర్యవేక్షణలో, జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో, కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ ఎస్. అనిల్ కుమార్ మరియు కీసర పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్నారు. కేసు దర్యాప్తు బృందాన్ని మల్కాజ్గిరి జోన్ డీసీపీ సీహెచ్ శ్రీధర్, ఐపీఎస్ అభినందించారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలి

**- అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశం**



**కరీంనగర్** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి గణేష్ నిమజ్జన స్థలాన్ని సందర్శించిన మేయర్ అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ వెలుగులు, పారిశుద్ధ్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి

**- కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి** రీ-సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సర్వే అధికారులను ఆదేశించారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలో కొనసాగుతున్న డిజిటల్ భూ రీ-సర్వే పనులను బుధవారం కలెక్టర్ రాహుల్ శర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీ-సర్వే పనుల పురోగతిని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తి చేసిన సర్వే వివరాలను ఎడి కుసుమ కుమారుని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులకు నోటీసుల జారీ ప్రక్రియ, సర్వే బృందాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సర్వే నిర్వహణను అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో 70 గ్రామాల్లో కొనసాగుతున్న డిజిటల్ భూ పునఃసర్వే పనులను వేగవంతం చేసి, మొదటి విడత సర్వేను నవంబర్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సర్వే పనులు మందకొడిగా సాగుతున్నందున వేగం పెంచాలని, ప్రతి మండలంలో రీ-సర్వే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో సర్వే బృందాల సంఖ్యను పెంచడంతో పాటు రోవర్ పరికరాల కొనుగోలు ప్రక్రియను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లాలో లైసెన్సుడ్ సర్వేయర్లు97 మంది ఉన్నారని అందరూ సర్వేలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లలో 54 మంది విధులకు హాజరు కావడం లేదని ఏడి కుసుమ కుమారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సెలింగ్ అనంతరం కూడా విధులకు హాజరుకాని పక్షంలో ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించినట్లు భావించి లైసెన్స్‌ల రద్దుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే డిజిటల్ భూ సర్వే ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు, రికార్డులను అందుబాటులో ఉంచి సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, సర్వే సిబ్బంది, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా వై.ఎస్.ఆర్ వర్ధంతిసంక్షేమానికి చిరునామా వై.ఎస్.ఆర్

**-ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం**

కరీంనగర్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో వై.ఎస్.ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వై.ఎస్.ఆర్ అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలిచారని కొనియాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. కరీంనగర్ జిల్లా అభివృద్ధిలోనూ వై.ఎస్.ఆర్ పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్న వై.ఎస్.ఆర్ ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు గుండెల్లో.. వైఎస్సార్ చెరగని సంతకం

**- వర్ధంతి సందర్భంగా జోగి రమేష్ నివాళి**



ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తెలుగు ప్రజల గుండెల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిపోయారని మాజీ మంత్రి, మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లోని గాంధీ బొమ్మ వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ అమలు చేసిన పథకాలు ఆయనను ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

# పవన్ పుట్టినరోజు వేడుకలు.. సేవా సందడి

**- ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో కేక్ కటింగ్..**

**- నాగబాబు ఆధ్వర్యంలో భారీ అన్నదానం**



ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. రింగ్ సెంటర్‌లో జనసేన నాయకుడు దేవాబత్తుల నాగబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా నాగబాబు కేక్ కట్ చేసి అభిమానులు, స్థానికులు, బాటసారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, రాష్ట్ర అభివృద్ధిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అన్నదానంతో ఆప్యాయతజన్మదిన వేడుకల్లో భాగంగా నాగబాబు సౌజన్యంతో రింగ్ సెంటర్‌లో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానికులు, పేదలు, బాటసారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భోజనాలు చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జనసేన నాయకులు రాజుల ప్రవీణ్, చింత శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, సాంబయ్య, అజ్జ శ్రీధర్, రామారావు, ఎన్.కృష్ణంరాజు, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, చిట్టేలు హరీష్, కోటేశ్వరరావు, పగిడిపల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలో శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



శ్రీశైలం (ప్రశ్నన్యూస్) లోక కల్యాణం కోసం దేవస్థానం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి.వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది.కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** దివంగత ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నేతికార్ సురేష్ లాల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

### ప్రజా సంక్షేమమే వైఎస్సార్ ఆశయం..

వైఎస్సార్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, పేదలకు సంక్షేమ పథకాల ద్వారా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా నేతికార్ సురేష్ లాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.ం

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**- యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు**

**- స్ఫూర్తి మహిళా మండలి, పోలీసుల అవగాహన**



పాచిపెంట(ప్రశ్న న్యూస్) మాదక ద్రవ్యాలకు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని గ్లోబల్ స్ఫూర్తి మహిళా మండలి రాష్ట్ర డైరెక్టర్ బలగ రాధానాయుడు సూచించారు. పాచిపెంట మండలం కీరంగి పంచాయతీ నందేడవలస గ్రామంలో బుధవారం స్ఫూర్తి మహిళా మండలి, పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణ, మూఢనమ్మకాలు, మహిళా చట్టాలు, రోడ్డు భద్రత, బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా రాధానాయుడు మాట్లాడుతూ గంజాయి, నాటుసారా వంటి మాదక పదార్థాల వైపు యువత ఆకర్షితులైతే వారి భవిష్యత్తే అంధకారమవుతుందని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా విద్యపై దృష్టి సారించాలని, గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. యువత అభివృద్ధి చెందితేనే కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.మూఢనమ్మకాల ముసుగులో మోసాలకు గురికావద్దని ఆమె సూచించారు. చిల్లంగి, చేతబడులు వంటి నమ్మకాల కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

### బాల్యవివాహాలకు చెక్

ఎస్సై అర్జున్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఏజెన్సీ గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలతో పాటు మహిళా చట్టాలు, రోడ్డు భద్రత, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.18 ఏళ్లు నిండకముందే బాలికలకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమే కాకుండా వారి భవిష్యత్తుకు తీవ్ర నష్టం కలిగిస్తుందని వివరించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్యవివాహాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు బాల్యవివాహాలను ప్రోత్సహించకుండా వాటిని అడ్డుకునేందుకు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో మాజీ సర్పంచి సామల లచ్చయ్య, మహిళా పోలీసు విజయ, గిరిజనులు పాల్గొన్నారు.

# నడి రోడ్డుపై భార్యను కత్తితో పొడిచి చంపిన భర్త

**- అడ్డుకోవడానికి ప్రయత్నించిన అత్తకు తీవ్ర గాయాలు ఆసుపత్రికి తరలింపు**



**ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్)**పదిర గ్రామానికి చెందిన గండికోట ఎల్లవ్వ కూతురు జ్యోతి (రజిత)ని ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామానికి చెందిన పల్లెపు సురేష్ అనే వ్యక్తితో వివాహం జరుపగా గత కొద్ది రోజుల క్రితం నుండి మనస్పర్ధలతో తల్లిగారింటి వద్ద ఉంటున్న భార్యపై భర్త దాడి చేయగా అడ్డువచ్చిన అత్తపై కూడా దాడి చేసినట్లుగా గ్రామస్తులు తెలిపారు. భార్య గొంతు, కడుపు, చేతులపై విచక్షణారహితంగా పొడిచి హతమార్చాడు. అత్త ఎల్లవ్వ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అక్కడినుండి తరలించి, గాయపడ్డ ఎల్లవ్వ ను ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు దారితీసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# వంద రోజుల్లో స్వర్గం చూపిస్తామని.. వెయ్యి రోజులుగా నరకం

**- బి ఆర్ ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఫైర్**

**- నాగారం చౌరస్తాలో బిఆర్ఎస్ మహా ధర్నా**



కీసర (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా.. టిఆర్ఎస్ మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ వెయ్యి రోజులపాలన విఫలమైన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాంపల్లి చౌరస్తాలో మహా ధర్నా చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కీసర మండల టిఆర్ఎస్ నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఈ 1000 రోజులను 'క్రిమినల్ వేస్ట్' అని, పాలన 'ప్రజా పీడన' అని ఆయన అభివర్ణించారు. ప్రభుత్వం అబద్ధాలు, అజ్ఞానం, అరాచకం, అవినీతితో నిండిపోయిందని, అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. 100 రోజుల్లో స్వర్గం చూపిస్తామని చెప్పి.. 1000 రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారని విమర్శించారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నెరవేర్చని హామీలను 420 అడుగుల ఫ్లెక్సీ రూపంలో రూపొందించి ప్రదర్శించారు. ఈ ధర్నాలో ఉమ్మడి కీసర మండల బి ఆర్ ఎస్ మాజీ అధ్యక్షులు జలాల్పురం సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్స్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ,పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్వారీలపై రోజా రాద్ధాంతం ఎందుకు

**- భాను ప్రకాష్**

**- అనుమతులు ఎవరి హయాంలో ఇచ్చారో ముందుగా చెప్పాలి**

**- ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అధికారులను కలిసి పరిష్కరించాలి**



నగరి(ప్రశ్న న్యూస్) పుత్తూరు మండలం చెర్లోపల్లి క్వారీ వద్ద మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ స్పందించారు. క్వారీలకు అనుమతులు తన మంత్రి పదవీకాలంలోనే ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు అదే అంశంపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో ఈ వ్యాఖ్యలు చేశారు.క్వారీలకు సంబంధించిన అనుమతులు ఏ సమయంలో, ఎవరి హయాంలో మంజూరయ్యాయో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని ఎమ్మెల్యే భాను ప్రకాష్ కోరారు. తన హయాంలో అనుమతులు ఇచ్చి ఉంటే.. ప్రస్తుతం వాటిపై ప్రశ్నలు లేవనెత్తడం వెనుక రాజకీయ ఉద్దేశం ఏమిటో రోజా వివరించాలని ఆయన ప్రశ్నించారు.

### అధికారులను కలిసి సమస్య పరిష్కరించాలి..

క్వారీల విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయని భావిస్తే సంబంధిత అధికారులను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని భాను ప్రకాష్ సూచించారు. క్వారీ ప్రాంతాలకు వెళ్లి రాజకీయ విమర్శలు చేయడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదని ఆయన అభిప్రాయపడ్డారు.రోజా చేస్తున్న విమర్శలు రాజకీయంగా తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో భాగమని భాను ప్రకాష్ ఆరోపించారు. అయితే క్వారీలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తోందని ఆయన పేర్కొన్నారు.జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ విధానాలపై కూడా ఎమ్మెల్యే విమర్శలు చేశారు. ప్రజా సమస్యలను రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా నిర్మాణాత్మకంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరు ప్రజల కోసం పనిచేస్తున్నారో.. ఎవరు రాజకీయ ప్రయోజనాల కోసం మాట్లాడుతున్నారో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో రక్తదాన శిబిరం

**- జనసైనికులు, అభిమానుల భారీ స్పందన.. స్వచ్ఛందంగా రక్తదానం**

**- సేవా కార్యక్రమాలతో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు**

**నాచారం (ప్రశ్న న్యూస్)** జనసేన పార్టీ అధినేత, ప్రముఖ సినీ నటుడు పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి నాచారం డివిజన్‌లో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. నాచారం సీడీఎస్ భవనంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నిహారిక హాజరయ్యారు. పవన్ కళ్యాణ్‌పై అభిమానంతో పెద్ద సంఖ్యలో జనసైనికులు, అభిమానులు శిబిరానికి తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చనే సందేశాన్ని కార్యక్రమ నిర్వాహకులు ప్రజల్లోకి తీసుకెళ్లారు. హైదరాబాద్ లోని నాచారంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రక్తదాన శిబిరానికి జనసైనికులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ జనసేన నాయకులు రామకృష్ణారెడ్డి, జమ్మల మధు, సోమేశ్, కే. మధు, సాయికిరణ్, వి. మధు, సారయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.



# 'రోమాంచకం'కు పెరిగిన క్రేజ్.. బుక్‌మైషోలో ట్రెండింగ్!




దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరిస్తున్న 'రోమాంచకం' చిత్రానికి ప్రీ రిలీజ్ దశలోనే అద్భుతమైన స్పందన లభిస్తోంది. నేటి నుంచి ఈ సినిమా ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, టికెట్ బుకింగ్స్ ప్లాట్‌ఫామ్‌లలో సినిమాకు విశేషమైన ఆదరణ కనిపిస్తోంది. ఈ చిత్రంలో సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటించారు.ప్రముఖ టికెటింగ్ పోర్టల్ బుక్‌మైషోలో 24 గంటల్లోనే 'రోమాంచకం' చిత్రానికి భారీ స్థాయిలో టికెట్లు అమ్ముడవడం విశేషం. ఈ సినిమా ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉండటం, దీనిపై నెలకొన్న అంచనాలకు నిదర్శనంగా నిలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా బ్రాండ్ తోడవ్వడంతో ఈ చిన్న సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి ఏర్పడింది.వేణు గోపాల్ రెడ్డి ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. సందీప్ రెడ్డి వంగా సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా, భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ఈ సినిమాను నిర్మించారు. "ప్రేమ, హాస్యం, ఉత్కంఠ" అనే ట్యాగ్‌లైన్‌తో వస్తుండటంతో ఇది ఒక విభిన్నమైన ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని తెలుస్తోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక ప్రధాన పాత్రలు పోషించారు.(సాధారణంగా పెద్ద సినిమాలకు కనిపించే బుకింగ్స్ ట్రెండ్, 'రోమాంచకం' చిత్రానికి కూడా కనిపిస్తుండటం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సందీప్ వంగా సమర్పణ సినిమాకు అతిపెద్ద బలంగా మారిందని, ఈ పాజిటివ్ బజ్ ఓపెనింగ్స్‌కు ఎంతగానో దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. నేటి ప్రీమియర్లతో ఈ 'రోమాంచకం' ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

# 'పళ్ల బురుసు' మూవీ రివ్యూ!




'బలగం' సినిమాతో సుధాకర్ రెడ్డికి – మురళీధర్ గౌడ్ కి మంచి పేరు వచ్చింది. తెలంగాణ నేపథ్యంతో కూడిన సినిమాలలో వాళ్లకంటూ ప్రత్యేకమైన పాత్రలను క్రియేట్ చేసే స్థాయిలో గుర్తింపును సంపాదించుకున్నారు. అలాంటి వాళ్లిద్దరూ తండ్రీకొడుకులుగా నటించిన సినిమానే 'పళ్ల బురుసు'. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఆగస్టు 14వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ రోజు (సెప్టెంబర్ 2)వ తేదీ నుంచి ఈ సినిమా 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది.  అది తెలంగాణ ప్రాంతంలోని ఒక పల్లెటూరు. అక్కడ శంభూ (సుధాకర్ రెడ్డి) అనే రైతు నివసిస్తుంటాడు. శంభూకి తిరుపతి (మురళీధర్ గౌడ్) అనే కొడుకు ఉంటాడు. ఆయన భార్య మారుతి .. కూతురు 'రేఖ' ఇదే ఆయన కుటుంబం. ప్రభుత్వ ఉద్యోగి అయిన తిరుపతి, తన తండ్రిని గురించి పెద్దగా పట్టించుకోడు. అందువలన శంభూ వేరే ఉంటూ, తనకున్న 'ఎకరం భూమి'ని సాగుచేసుకుంటూ ఉంటాడు. కొంతకాలంగా 'పంటి' సమస్యతో ఆయన బాధపడుతుంటాడు. డాక్టర్ చెప్పిన ప్రకారం 'పళ్ల బురుసు'(టూత్ బ్రష్) వాడాలని నిర్ణయించుకుంటాడు. శంభూ తనకి 'పళ్ల బురుసు' తెచ్చిపెట్టమని తిరుపతికి చెబుతాడు. అయితే అతను తన కూతురు 'రేఖ' పెళ్లిపనులలో ఉండటం వలన తీసుకురాలేకపోతాడు. ఉద్దేశ పూర్వకంగానే తన తండ్రిని పెళ్లికి పిలవడం మానేస్తాడు. తన మనవరాలి పెళ్లికి తనని పిలిచేదేమిటని భావించిన శంభూ ఆ పెళ్లికి వెళతాడు. అయితే తనని పట్టించుకోవడం మానేశారనే బాధ లోలోపల తొలిచేస్తూ ఉంటుంది. దాంతో అతను తన కొడుకు తనని పట్టించుకోవడం లేదంటూ కోర్టులో కేసు వేస్తాడు. తండ్రి తీసుకున్న ఈ నిర్ణయం తిరుపతిని షాక్ కి గురిచేస్తుంది. కూతురు పెళ్లి కోసం అయిన అప్పును తీర్చడం కోసం తన తండ్రి పేరుతో ఉన్న ఎకరం పొలాన్ని అమ్మేయాలని తిరుపతి భావిస్తాడు. తాను బ్రతికుండగా ఆ పొలాన్ని అమ్మేయడానికి ఒప్పుకోనని శంభూ తేల్చి చెబుతాడు. అప్పుడు తిరుపతి ఏం చేస్తాడు? శంభూ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? అనేది మిగతా కథ. విలేజ్ నేపథ్యంలోని ఒక తండ్రి .. ఒక కొడుకు .. ఒక 'పళ్ల బురుసు' (టూత్ బ్రష్) చుట్టూ తిరిగే కథ ఇది. తనకి పళ్ల బురుసు కొనిపెట్టమని ఆ తండ్రి కొడుకును అడగడం .. అతను ఆ విషయాన్ని గురించి అంతగా పట్టించుకోకపోవడం .. దాంతో కొడుకుపై అతను కేసు వేయడం .. తండ్రికున్న కొద్దిపాటి పొలానికి కూడా ఆ కొడుకు ఎసరు పెట్టడం వంటి అంశాలను కలుపుకుంటూ దర్శకుడు ఈ కథను ఆవిష్కరించే ప్రయత్నం చేశాడు. నిజానికి శంభూ ఆ టూత్ బ్రష్ ను ఎవరితోనో ఒకరితో తెప్పించుకోవచ్చు. కానీ తన కోసం తన కొడుకు ఆ మాత్రం సమయాన్ని కేటాయిస్తాడా లేదా అనే తండ్రి నిరీక్షణయే ఈ కథలో ప్రధానమైనదిగా చెప్పుకోవచ్చు. అలాగే రచ్చబండ దగ్గర చేరే శంభూ తోటివాళ్లు .. వాళ్ల బలహీనతలు, ఒక కుర్ర ప్రేమజంటను కలుపుకుంటూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. ప్రధానమైన కథ నుంచి కాస్త వినోదం దిశగా ఈ ట్రాకులు తీసుకెళతాయి. పిల్లలు ఎదిగిన తరువాత .. తల్లిదండ్రుల అవసరం తీరిపోయిన తరువాత వాళ్లను పూర్తిగా పక్కన పెట్టేస్తున్నారు. వాళ్లు ఏం చేస్తున్నారో .. ఎలా ఉంటున్నారో అనేది పట్టించుకోవడం మానేస్తున్నారు. వాళ్లను అడగాలి .. వాళ్లకి చెప్పాలి అనే విషయం మరిచిపోతున్నారు. ఒంట్లో ఓపిక నశించి ఒంటరిగా మిలిపోయిన పరిస్థితులలో వాళ్లు ఎంతగా బాధపడుతూ ఉంటారనేది దర్శకుడు ఆవిష్కరించిన విధానం ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుంది. ఇక ఇది వరకూ పల్లెల్లో మంచి చెడూ మాట్లాడుకోవడం, పక్కవాడిని పట్టించుకుని సాయం చేయడం ఉండేవి. కానీ ఇప్పుడు స్మార్టు ఫోన్లు వచ్చిన తరువాత అందరూ వాటితోనే గడిపేస్తున్నారు. ఎవరి కష్టం .. నష్టం ఎవరూ పట్టించుకోని పరిస్థితులలోకి పల్లెలు వెళ్లిపోయాయనే విషయాన్ని దర్శకుడు టచ్ చేసిన విధానం ఆలోచింపజేస్తుంది. అలాగే పల్లెలోని లొకేషన్స్ మనసును పట్టుకుంటాయి. అయితే ఈ కథను దర్శకుడు కామెడీ టచ్ తోనే చెప్పాలని అనుకున్నాడు. అయితే ఆశించిన స్థాయిలో కామెడీ వర్కౌట్ కాకపోవడం వలన కాస్త సీరియస్ గా మారిపోయినట్టు అనిపిస్తుంది. కామెడీపై మరింత ఫోకస్ పెడితే, కంటెంట్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్లేదని అనిపిస్తుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదు. పాటలు .. పాటలలోని సాహిత్యం ఆకట్టుకుంటాయి. పల్లె జీవితాలు .. బంధాలు .. అనుబంధాలను తాకుతూ అర్థవంతంగా సాగుతాయి. వయసు మళ్లిన తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి కోరుకునేది తాము ఇంకా బ్రతికే ఉన్నామనే గుర్తింపు, అండగా ఉన్నామంటూ ఇచ్చే ఓదార్పు అంతే. ఇదే సందేశంతో సాగిపోయే సినిమా ఇది. కథనం కాస్త నిదానంగా అనిపించినా, సహజత్వంతో మెప్పించే కంటెంట్ గానే కనిస్తుంది.

# రష్మిక 'మైసా' విడుదల అప్పుడే..



గిరిజన వీరనారిగా అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకుడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం రిలీజ్ డేట్‌ని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా 'మైసా' విడుదల కానున్నది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో.. ఒక పెద్ద ఈటె పట్టుకుని, శరీరంపై యుద్ధ గాయాలతో నిలబడి ఉన్న రష్మికను చూడొచ్చు. ఇది యాక్షన్‌తో కూడిన పీరియడ్ డ్రామా అని ఈ స్టిల్ చెబుతున్నది.'ఉత్కంఠ భరితమైన పోరాటాలతో ఓ బెంచ్ మార్క్‌ని క్రియేట్ చేసేలా ఈ సినిమా రూపొందుతున్నది. అద్భుతమైన వీఎఫ్ఎక్స్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం రష్మిక అంకితభావంతో పనిచేస్తున్నారు. ఇటీవలే యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె గాయపడ్డ విషయం తెలిసిందే. గాయం నయం కాగానే తిరిగి షూటింగ్‌లో పాల్గొని చివరి దశ షూటింగ్‌ని పూర్తి చేస్తారు. ఇంకా 12రోజుల షూటింగ్ మాత్రమే మిగిలివున్నది' అని మేకర్స్ తెలిపారు. శరవేగంగా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రేయాస్ పి.కృష్ణ, సంగీతం: జేక్స్ బెజోయ్.

## ఆర్గానిక్‌గా నవ్వించే ప్రేమకథ

# 'రోమాంచకం



'ఇంజనీరింగ్ పూర్తి చేసి బయటకు వచ్చిన యువకుడి జీవితంలో ఏం జరిగింది? అతని ప్రేమకథ ఎలా సాగింది? అతని స్నేహితులలో నెలకొన్న గందరగోళం ఏంటి? మొత్తంగా ఈ ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. ఎక్కడా బోర్ కొట్టించే ఫోర్స్ కామెడీ ఉండదు. సహజంగా, ఆర్గానిక్‌గా సినిమా నవ్విస్తుంది. 2గంటల 20 నిమిషాల పాటు సమయం తెలియకుండా వేగంగా సాగిపోయే వినోదాత్మక చిత్రమిది. సంగీత పరంగానూ అందరికీ నచ్చుతుంది' అని నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా అన్నారు.

అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ఆయన నిర్మించిన యువతరం ప్రేమకథ 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ జంటగా నటించిన ఈ చిత్రానికి వేణుగోపాల్‌రెడ్డి దర్శకుడు. ఈ నెల 3న విడుదల కానున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా విలేకరులతో మాట్లాడారు. 'ఈ కథలో హ్యూమర్ ఉంది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఫ్రెండ్స్ మధ్య జరిగే సరదా సన్నివేశాలున్నాయి. దర్శకుడు వేణుగోపాల్ మూడ్నాలుగేండ్లుగా మాతో ట్రావెల్ చేస్తున్నారు.

ఆయన స్క్రిప్ట్ నెరేషన్ మమ్మల్ని ఆకట్టుకుంది. అందుకే ఈ కథను టేకప్ చేశాం. కథ వినగానే, ముందు ఒక సీన్ చేసుకురమ్మని చెప్పాం. తను అద్భుతంగా చేసి చూపించాడు. ఆ సీన్ చూశాక సినిమా కూడా బాగా చేస్తాడని నమ్మకం కుదిరింది. అంతే.. ఇక వేణుగోపాల్‌కి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. ప్రాజెక్ట్ ఓకే అయ్యాక, సందీప్ ఈ సినిమా విషయంలో అస్సలు జోక్యం చేసుకోలేదు. ఆయన 'స్పిరిట్' పనుల్లో బిజీగా ఉన్నారు. సినిమా పూర్తయ్యాక ఫస్ట్ కట్ చూసి హ్యాపీగా ఫీలయ్యాడు.

సెన్సార్ యు/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. అన్ని వయసులవారూ ఇబ్బంది లేకుండా ఈ సినిమా చూడొచ్చు' అని చెప్పారు ప్రణయ్‌రెడ్డి వంగా. హీరోహీరోయిన్లతో పాటు ఇతర కీలక పాత్రధారులు కూడా బాగా నటించారని, టెక్నీషియన్స్ కూడా ప్యాషనేట్‌గా వర్క్ చేశారని, హైదరాబాద్ బేస్డ్‌గా సాగే ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుందని ప్రణయ్‌రెడ్డి వంగా పేర్కొన్నారు.

# సర్దార్2 సీక్రెట్ ఆపరేషన్



అగ్ర కథానాయకుడు కార్తీ నటించిన 'సర్దార్' తమిళంతోపాటు తెలుగులోనూ మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ సినిమాకు సీక్వెల్‌గా ఆయన నటించిన 'సర్దార్ 2' ఈ నెల 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నది. ఈ స్పై, యాక్షన్ మిస్టరీ ఎమోషనల్ డ్రామాకు పీఎస్ మిత్రన్ దర్శకుడు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణ్‌కుమార్ నిర్మించారు. ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రెండు కాలాల్లో జరిగే కథ ఇదని ట్రైలర్ చెబుతున్నది. మురుగన్ భక్తుడైన సర్దార్‌ను జపాన్‌లో జరిగే ఓ సీక్రెట్ ఆపరేషన్ కోసం రిక్రూట్ చేస్తారు. అది సాధారణమైన సీక్రెట్ ఆపరేషన్‌గా మొదలై ఊహించని మలుపు తీసుకుంటుంది. అక్కడ్నుంచి ఏం జరిగింది? ఈ కథలోకి సర్దార్ కొడుకు విజయ్ ఎలా ఎంటరయ్యాడు? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం. 'సర్దార్'ని మించే స్థాయిలో 'సర్దార్ 2' రూపొందిందని, ఇందులో కార్తీ తండ్రికొడుకులుగా మరోసారి మ్యాజిక్ చేయబోతున్నారని, రెండు పాత్రల్లో ఆయన బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్ డిఫరెంట్‌గా ఉంటాయని, ముఖ్యంగా యంగ్ సర్దార్‌గా కార్తీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆకట్టుకుంటుందని, ఇందులో విలన్ ఎస్.జె.సూర్య అనూహ్యమైన ప్రవర్తన కథలో టెన్షన్ పెంచుతుందని మేకర్స్ తెలిపారు. అశికా రంగనాథ్ కథానాయికగా నటించిన ఈ ఉద్వేగభరిత యాక్షన్ చిత్రానికి కెమెరా: జార్జ్ సి.విలియమ్స్, సంగీతం: యువన్‌శంకర్‌రాజా.

# 'ఐయామ్ గేమ్'

## అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది



'ఇది నా సంస్థలో తీసిన అతిపెద్ద సినిమా. ఈ కథలోని విషయం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. దర్శకుడు నాగ్‌అశ్విన్ ఈ సినిమా ఎడిటింగ్‌లో సహాయపడ్డారు. నా తెలుగు సినిమాల్లో 'మహానటి' నాకిష్టమైన సినిమా. నా నటజీవితానికే ఆ సినిమా ఓ మలుపు. తెలుగులో నేను కూడా ప్రముఖ నటుడిగా కొనసాగుతున్నానంటే.. ఆ క్రెడిట్ అంతా నాగీ, ప్రియాంక, స్వప్నలకే చెందుతుంది. ఈ సినిమా విషయంలోనూ వారి సహకారం ఉన్నది. ఈనెల 3న థియేటర్లలోకి సినిమా రానున్నది. తప్పకుండా మీ అందర్నీ సినిమా ఆనందింపజేస్తుంది' అని అగ్ర నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. జామ్ వర్గీస్‌తో కలిసి వేఫేరర్ ఫిల్మ్స్ పతాకంపై ఆయన నిర్మించిన పాన్ ఇండియా ఫాంటసీ థ్రిల్లర్ 'ఐయామ్ గేమ్'. దుల్కర్ సల్మాన్ కథానాయకుడు కయాదు లోహర్ కథానాయిక. నహాస్ హిదాయత్ దర్శకుడు. ఈ నెల 3న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో దుల్కర్ మాట్లాడారు. 'ట్రైలర్ ఆసక్తికరంగా ఉన్నది. ఈ సినిమా కొంత చూశాను. ఇందులో వినోదం కూడా ఓ స్థాయిలో ఉంటుంది. సినిమాను అమితంగా ప్రేమించే దుల్కర్ చేసిన ఈ సినిమా తప్పకుండా అందర్నీ ఆకట్టుకుంటుంది' అని అతిథిగా విచ్చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్ నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా ఆంటోని వర్గీస్, సందీప్ గుణ్ణం, కదిర్ కూడా మాట్లాడారు. అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదల కానున్నది.

# విభిన్నమైన కథలతో..



'ఇరుముడి' జోష్ మీదున్న రవితేజ.. ఆలస్యం చేయకుండా వెంటవెంటనే రెండు సినిమాలను లైన్లో పెట్టిన విషయం తెలిసిందే. వాటిలో ఒకటి హసిత్ గోలీ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న సినిమా కాగా.. రెండోది వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో లక్ష్మణ్ నిర్మిస్తున్న సినిమా. ఈ రెండు సినిమాలూ రెండు భిన్నమైన కథాంశాలతో తెరకెక్కుతున్నట్టు సమాచారం. హసిత్‌గోలీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్మెంట్‌తో సాగుతుందట. హీరో శ్రీవిష్ణు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో హీరోయిన్లు కూడా ఖరారైనట్టు తెలిసింది. రవితేజకు జోడీగా ఐశ్వర్య రాజేష్ నటిస్తుండగా, శ్రీవిష్ణుతో మాళవిక మోహనన్ జతకట్టనున్నదని వినికిడి. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే మొదలు కానున్నది. కేవలం నాలుగు నెలల్లోనే ఈ సినిమా పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక వివేక్ ఆత్రేయ సినిమా విషయానికొస్తే.. ఇది హారర్ కామెడీ జానర్ అని తెలిసింది. కథ నచ్చడంతో రవితేజ వెంటనే ఓకే చెప్పారట. ఇదే నిజమైతే రవితేజ నటిస్తున్న తొలి హారర్ కామెడీ సినిమా ఇదే అవుతుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నది.

## గుంటూరులో ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



గుంటూరు(ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గుంటూరు నగరంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం శ్రీనివాసరావుపేట మెయిన్‌రోడ్డులోని ఏ1 కన్వెన్షన్‌లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. జనసైనికులు, వీర మహిళలు ఉత్సాహంగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రాష్ట్ర మంత్రి, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పవన్ కల్యాణ్ తరఫున అందించిన సందేశాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సేవా కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా, నగర కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, జనసేన నాయకులు, వీర మహిళా నాయకులు, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

## రూ.1.35 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



కొండపల్లి(ప్రశ్న న్యూస్) కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. పులగుంట ప్రాంతంలో రూ.27 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్డు, వినాయకస్వామి గుడి వద్ద రూ.28 లక్షలతో తారురోడ్డుకు శంకుస్థాపన చేశారు. వెస్ట్ ఇబ్రహీంపట్నంలో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్‌ను ప్రారంభించారు. తూర్పు ఇబ్రహీంపట్నంలో రూ.20 లక్షలతో, 13వ వార్డులో మరో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్‌లను ప్రారంభించారు.ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరవయ్యేళ్ల తర్వాత వచ్చి.. హత్యకు గురై భార్యాబిడ్డల కళ్లెదుటే దారుణం

**- 2006 నాటి హత్య కేసు పాత కక్షలే కారణమా.?**

**- 11 మంది లొంగుబాటు.. మరో ముగ్గురు పరారీ**



గుంటూరు (ప్రశ్న న్యూస్) చిన్నాన్న మృతి చెందాడని 20 ఏళ్ల తర్వాత గుంటూరుకు వచ్చిన ఓ వ్యక్తి.. భార్యాబిడ్డల కళ్లెదుటే హత్యకు గురయ్యాడు. 2006లో జరిగిన ఓ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న పెంద్ర వెంకన్న అలియాస్ చిన్నా (పేరు మార్పు లేదు) ఆదివారం ఉదయం నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యకు గురయ్యారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.20 ఏళ్ల కిందట ఏం జరిగిందంటే..నగరంలోని కొండా వెంకటప్పయ్య కాలనీకి చెందిన చిన్నా సుమారు 20 ఏళ్ల కిందట అక్కడే నివసించేవారు. అదే ప్రాంతానికి చెందిన బుల్లయ్యతో వ్యక్తిగత కారణాలతో ఆయనకు విభేదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో 2006లో బుల్లయ్య హత్యకు గురయ్యారు. ఈ ఘటనలో చిన్నాపై అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే కేసు కోర్టులో వీగిపోవడంతో చిన్నా బయటకు వచ్చారు.తనకు బుల్లయ్య కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని భావించిన చిన్నా గుంటూరు నుంచి మంగళగిరికి, అనంతరం తెలంగాణలోని సూర్యాపేటకు వెళ్లిపోయినట్లు నగరంపాలెం సీఐ రాజేశ్ తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాలుగా అక్కడే నివసిస్తున్నట్లు చెప్పారు.ఈ క్రమంలో ఆగస్టు 29న కొండా వెంకటప్పయ్య కాలనీలో ఉంటున్న తన బాబాయి మృతి చెందినట్లు చిన్నాకు సమాచారం అందింది. దీంతో భార్య వెంకటమ్మ, పిల్లలతో కలిసి సూర్యాపేట నుంచి గుంటూరుకు వచ్చారు. పెళ్లయిన తర్వాత సూర్యాపేట నుంచి బయటకు రాలేదని, బాబాయి మృతి సమాచారంతోనే గుంటూరుకు వచ్చామని వెంకటమ్మ తెలిపారు.తాము గుంటూరుకు వస్తున్న విషయం తెలుసుకున్న బుల్లయ్య కుటుంబ సభ్యులు చిన్నాపై దాడికి పథకం వేసినట్లు ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం బయటకు వెళ్లిన చిన్నాపై కొందరు దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు.తన కళ్లెదుటే, పిల్లలు చూస్తుండగానే భర్తను హత్య చేశారని వెంకటమ్మ కన్నీరుమున్నీరయ్యారు. పాత కేసులో తన భర్త పాత్ర లేదని కోర్టు కొట్టివేసిందని, అనంతరం ఇరు వర్గాల మధ్య రాజీ కూడా జరిగిందని ఆయన చెప్పేవారని తెలిపారు. పాత గొడవలు సమసిపోయాయని భావించామని.. ఇంతలోనే దాడి జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### 11 మంది లొంగుబాటు

ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నగరంపాలెం సీఐ రాజేశ్ తెలిపారు. ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న బుల్లయ్య కుమారుడు ఇమ్మాన్యుయేల్ రాజుతో పాటు మొత్తం 11 మంది పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు చెప్పారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వెల్లడించారు.బుల్లయ్య హత్యకు గురైనప్పటి నుంచి ఆయన కుమారుడు ఇమ్మాన్యుయేల్ రాజు పగతో రగిలిపోయినట్లు తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఇంట్లో తండ్రి బుల్లయ్య ఫొటోను ఎదురుగా పెట్టుకుని నిత్యం చూస్తూ ఉండేవాడని పేర్కొన్నారు. ఈ పాత కక్షే తాజా హత్యకు దారితీసిందా.? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వైఎస్సార్‌కు ఘన నివాళి

**- 17వ వర్ధంతి సందర్భంగా పూలమాలలతో నివాళులర్పించిన: మాజీ ఎమ్మెల్యే శివకుమార్**




తెనాలి(ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలను తెనాలి పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రణరంగ్ చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి వైఎస్సార్ ప్రభుత్వం అందించిన ప్రాధాన్యాన్ని నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో దేసు శ్రీనివాసరావు, పేరం సంజీవరెడ్డి, తాడిబోయిన రమేష్, షేక్ దుబాయ్ బాబు, తోట రఘురాం, యాతాటి అనిల్, ఆర్వపల్లి సిరికృష్ణ, కటివరపు దేవానంద్, ధరణికోట మల్లీ, బూరెలు దుర్గాప్రసాద్, కటారి హరీష్, మద్దాలి శేషాచలం, గోళ్ల సందీప్, బండ్లమూడి నాగేశ్వరరావు, పొట్లూరి అశోక్, శానంపూడి రఘురామిరెడ్డి, షేక్ మీరాం సా, బ్రదర్ ఆనంద్, అక్కిదాసు కిరణ్‌కుమార్, కాళహస్తి భవానీశంకర్, ఈద్గా గౌస్, కొంగర రాగమంజరి, ఎం.ఇందిరా ప్రియదర్శిని, సిద్ధబత్తుని శాంతి, తురకా శాంతకుమారి, కాళిదాస్ సత్యం, ప్రసాదం సురేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## మైనార్టీలకు అండగా ఉంటాం

**- ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తాం**

**- సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యలు తీసుకెళ్తాం: బొండా ఉమ**



**విజయవాడ సెంట్రల్(ప్రశ్న న్యూస్)** మైనార్టీ కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. సింగ్‌నగర్‌లోని షాదీఖానా ఫంక్షన్ హాల్‌లో బుధవారం సెంట్రల్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ గౌస్ భాషా ఆధ్వర్యంలో నిర్వహించిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ వర్గాల సమస్యలు, సంక్షేమం, అభివృద్ధి అంశాలపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు.నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి మైనార్టీ కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని బొండా ఉమ తెలిపారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. మైనార్టీ కుటుంబాల్లో ఒకడిగా వారి కష్టాలు, అవసరాలను అర్థం చేసుకుని ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.మైనార్టీ యువతకు అందాల్సిన రుణాలు, ప్రభుత్వ ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడకు రానున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని మైనార్టీ వర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బొండా ఉమ తెలిపారు. మైనార్టీల విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.మైనార్టీ సోదరులు, సోదరీమణులు ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా తనను సంప్రదించాలని, వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బొండా ఉమ తెలిపారు.కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, మహిళా అధ్యక్షురాలు పైడి తులసి, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మేహేరుదిన్, షేక్ అన్వర్, షేక్ బడేబాజీ, జిల్లా కార్యదర్శి షేక్ గౌసియ, షేక్ జాన్‌వలి, మోతూ్కరి కాసిం, షేక్ పర్వీన్, షేక్ దస్తగిరి, షేక్ జానిబాషా, దొండపాటి సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## పవన్ నాయకత్వం రాష్ట్రానికి అవసరం

**- కేశినేని చిన్నికి.. జనసేనాని జన్మదిన వేడుకలు**




తిరువూరు(ప్రశ్న న్యూస్) రాష్ట్ర అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నాయకత్వం ఎంతో అవసరమని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. తిరువూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పవన్ కల్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడేందుకు పవన్ కల్యాణ్ చేసిన పోరాటం, కూటమి ఏర్పాటులో ఆయన పోషించిన పాత్రను ప్రజలు మరువరని పేర్కొన్నారు.వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాల కోసం తెదేపా, జనసేన, భాజపా కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ మధ్య ఉన్న సమన్వయం రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తోందని చెప్పారు.

### యువతతో చిన్ని ముచ్చట

కార్యక్రమం అనంతరం ఎంపీ కేశినేని చిన్ని యువతతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.కార్యక్రమంలో జనసేన తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు పుల్లారావు, విజయ్, ఏఎంసీ డైరెక్టర్ మాధవరావు, పీఏసీఎస్ చైర్మన్ సీతారామస్వామి, డైరెక్టర్లు నవీన్, కొండబాబు, పట్టణ నాయకులు లింగనేని సుధాకర్, పసుపులేటి రవీంద్ర, రామిశెట్టి జగన్, నామా నాగరాజు, పసుపులేటి పండు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పటిష్ఠ భద్రత

**- గరుడసేవ వేళ.. నిమజ్జనాలపై ప్రత్యేక దృష్టి**

**- డీజేలు, మద్యం సేవించి డ్రైవింగ్‌పై కఠిన చర్యలు: ఎస్పీ సుబ్బారాయుడు**



తిరుపతి,(ప్రశ్న న్యూస్) వినాయక చవితి, శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఒకేసారి జరగనున్న నేపథ్యంలో నిమజ్జనాలు, గరుడసేవకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎం.జయకృష్ణతో కలిసి బుధవారం నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.గరుడసేవ సెప్టెంబరు 18, 19 తేదీల్లో జరగనున్నందున తిరుమలకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. నిమజ్జనాలను ప్రధానంగా మూడో రోజు లేదా ఏడో రోజు తర్వాత నిర్వహించేలా మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో ముందస్తు అనుమతులు తీసుకోవాలని, మండపాల వద్ద విద్యుత్, అగ్నిమాపక భద్రత చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని చెప్పారు.శోభాయాత్రల నిర్వహణపై మార్గదర్శకాలు ఇచ్చేందుకు సెప్టెంబరు 12న పోలీసు, మునిసిపల్, టీటీడీ, విద్యుత్ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలి

కమిషనర్ ఎం.జయకృష్ణ మాట్లాడుతూ సెప్టెంబరు 14, 16, 20 తేదీల నిమజ్జనాలకు అనుగుణంగా రూట్‌మ్యాప్ సిద్ధం చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శోభాయాత్రలకు అంతరాయం కలిగించే చెట్ల కొమ్మలను తొలగించాలని, టోయింగ్ వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అశ్లీల నృత్యాలు, నిమజ్జన సమయంలో టపాకాయల వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు. మహిళలు, చిన్నారులకు ప్రత్యేక భద్రత కల్పించాలని ఆదేశించారు.వినాయక సాగర్ వద్ద టీటీడీ ఆధ్వర్యంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, విగ్రహాల నిమజ్జనానికి తెప్పలు ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు పసుపు, కుంకుమ, కంకణాలు, పుస్తక ప్రసాదాల పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.సమావేశంలో అదనపు కమిషనర్ శారదాదేవి, ఏఎస్పీ రవి మనోహరాచారి, టీటీడీ, తుడా, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు, నిమజ్జన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డిపై విమర్శలు.. కేతంరెడ్డి ఫైర్

**- అవినీతి అంశాలపై ఆధారాలతో బయటపెడతామని వెల్లడి**



నెల్లూరు(ప్రశ్న న్యూస్) నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల ప్రజాదరణను చూసి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిలో భయం మొదలైందని తెదేపా నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆరోపించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఇటీవల చేసిన విమర్శలను ఆయన ఖండించారు. బుధవారం నెల్లూరు తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేతంరెడ్డి మాట్లాడారు.
గత ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భారీ మెజారిటీతో ఎంపీగా గెలవడం, నెల్లూరు జిల్లాలో ఎన్డీయే కూటమి పది నియోజకవర్గాల్లో విజయం సాధించడాన్ని కేతంరెడ్డి ప్రస్తావించారు. తమకు అందిన సమాచారం ప్రకారం వైసీపీ అంతర్గత సర్వేల్లోనూ కూటమికి అనుకూల ఫలితాలు వచ్చినట్లు చెబుతూ.. అందుకే వేమిరెడ్డిపై అనిల్‌తో విమర్శలు చేయిస్తున్నారని ఆరోపించారు.క్వార్ట్జ్ వ్యవహారంపై పరస్పర ఆరోపణలుక్వార్ట్జ్ మైనింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ గతంలో చేసిన ఆరోపణలనే మళ్లీ ప్రస్తావిస్తున్నారని కేతంరెడ్డి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాసిరకం, లో-గ్రేడ్ క్వార్ట్జ్ సరఫరా కారణంగా రాష్ట్రానికి, జిల్లాకు నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. అనిల్‌కుమార్ యాదవ్ వ్యవహారంపై ఆయన వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. రాజకీయంగా ఉనికిని కాపాడుకునేందుకే వేమిరెడ్డిపై విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.వేమిరెడ్డి దంపతులు ప్రజాసేవా కార్యక్రమాలతో ప్రజల్లో ఆదరణ పొందుతున్నారని కేతంరెడ్డి పేర్కొన్నారు.

## మార్పు కోసం.. 'జై కొట్టు'

**- యువత ఆలోచనలు, ఆకాంక్షలకు వేదికగా జనసేన యువజన విభాగం**



పిఠాపురంలో 'జై కొట్టు' ఆవిష్కరణ: మంత్రి నాదెండ్ల మనోహర్ పిఠాపురం(ప్రశ్న న్యూస్) యువతే జనసేన పార్టీకి బలమని, వారి ఆలోచనలు, ప్రతిభ, సూచనలకు ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. పార్టీ యువజన విభాగం లిలి'జై కొట్టు'లిలిను బుధవారం పిఠాపురంలో ఆవిష్కరించారు.పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫోన్ ద్వారా పంపిన సందేశాన్ని కార్యక్రమంలో వినిపించారు. 'మార్పు కోసం.. పోరాడే సేన కోసం జై కొట్టు' అంటూ ఆయన ఇచ్చిన సందేశం యువతలో నూతనోత్సాహాన్ని నింపింది. అనంతరం 'జై కొట్టు' లోగోను విడుదల చేశారు. జనసేన ప్రస్థానంలోని పోరాటాలు, విజయాలపై ఏవీలు, గీతాలను ప్రదర్శించారు. పవన్ కల్యాణ్ జన్మదిన కేక్‌ను కట్ చేశారు.ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఆలోచనలు ఎప్పుడూ యువత భవిష్యత్తు చుట్టూనే ఉంటాయని తెలిపారు. జనసేన పార్టీ పుట్టుక నుంచి ప్రతి ఉద్యమం, పోరాటంలో యువత కీలక పాత్ర పోషించిందన్నారు. రాజకీయాల్లోకి యువత అడుగుపెట్టి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.యువత సూచనలు, సలహాలు, ప్రతిభను పవన్ కల్యాణ్ లోతుగా పరిశీలిస్తారని చెప్పారు. '25 ఏళ్ల భవిష్యత్తు' కావాలన్న యువకుడి మాటను పార్టీ నినాదంగా తీసుకున్న సందర్భాన్ని గుర్తుచేశారు.కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ తలాటం సత్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం గంగా సధన్‌లో నిభందనలకు తూట్లు

- సర్వీసు రిము అయిన వ్యక్తి గత కొన్ని రోజులుగా ఒకే రూములో రెంటుకు ఉంటున్న వైనం
- మొన్న వడ్డెర సత్రంలో ఇలాగే 27 రోజులు రెంటు కట్టి ఆత్మహత్య చేసుకున్న ఐదుమంది వ్యక్తులు
- ఒకే ఫ్యామిలీ కేవలం 48 గంటలు మించి వసతి గదిలో ఉండకుడదు అంటూ వివరణ ఇచ్చిన అధికారులు ఈఓ శ్రీనివాసరావు
- ఇప్పుడు గంగాసధన్ లో సర్వీసు రిము అయిన వ్యక్తి ఎనిమిది రోజులుగ ఒకే రూములో ఉంటున్న పట్టించుకోని అధికారులు
- సర్వీసు రిము అయిన వ్యక్తి రూములో జరగరానిది ఏదైన జరిగితే భాద్యత ఎవరిది.?





**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** శ్రీశైలం దేవస్థానంలో కొందరు అధికారులు నిభందనలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. గత వారం రోజులుగా గంగా సధన్ వసతి గదిలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తి వసతి గదికి అద్దె చెల్లిస్తూ ఒకే రూములో ఉంటున్న మాజి ఉద్యోగి దేవస్థానంలో భద్రతాధికారిగా విధులు నిర్వహిస్తూ వివాదాలకు తావిచ్చారనే ఆరోపణలతో ఆ అధికారిని విధుల నుంచి శాశ్వతంగా తప్పిస్తూ సర్వీసు రిము చేస్తూ దేవస్థానం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు అతను వినియోగించే ప్రత్యేక వాహనం దేవస్థానం స్వాదీనం చేసుకుంది అయిన కూడ ఆ మాజి ఉద్వోగి దేవస్థానం వసతి గది అయిన గంగా సధన్ లో గత కొన్ని రోజులుగా వసతి గదిని ఖాలి చేయకుండా ఉంటూన్నారనే విమర్శలు వస్తున్నాయి. దేవస్థానం నిభందనలు ప్రకారం 48 గంటలకంటే ఎక్కువ ఎవరు అద్దెకు ఉండకుడదు అద్దెకు ఇవ్వకుడదు అటువంటి నిభందనలు కొందరు అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరించడంపై మాజి ఉద్యోగికి దేవస్థానంలోని కొందరు ఉద్యోగులకు అంతర్గతంగా లావాదేవీలు ఉన్నాయా.? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. మాజి ఉద్యోగికి ఇన్ని రోజులు అద్దెకు ఒకే రూము ఎలా ఇచ్చారు అనే ప్రశ్నలు భక్తులులలో వ్యక్తమవుతుంది. ఆ మజి ఉద్యోగి ఉంటున్న వసతి గదిలో జరగరానిది ఎద్దైన జరిగితే బాద్యులు ఎవరనేదే మిలియన్ డాలర్ల ప్రశ్న ఎద్దైన జరగరానిది జరిగితే అటు దేవస్థానానికి ఇటు ట్రస్ట్ బోర్డు కు చెడ్డపేరు వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు.

## గత వారంలో దేవస్థానం నిభందనలు పాటించని వడ్డె రాజుల సత్రం ఐదుమంతి రూములోనే ఆత్మహత్య

గత వారంలో శ్రీశైలం దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న వడ్డెరాజుల సత్రంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదు మంది వ్యక్తులు ఉరి వేసుకుని వసతి గదిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన అందరిని కలచివేసింది. వడ్డెరాజుల సత్రం యాజమాన్యం దేవస్థానం నిబంధనలు తుంగలో తొక్కి ఏకంగా ఒకే కుటుంబానికి సుమారు 27 రోజులు అద్దెకు ఇచ్చి ఐదుమంది వ్యక్తుల మరణానికి కారకులు అయినారనే ఆరోపణలు వచ్చాయి. ఎందుకంటే శ్రీశైలం దేవస్థానం పరిధిలో దేవస్థానం నిభందనలు ప్రకారం 48 గంటలు మించి ఎవరికి వసతి గది అద్దెకు ఇవ్వకుడదు అనే నిభందనలు ఉన్నాయి. కేవలం అద్దె కోసం కక్రుత్తిపడి ఐదుమంది మరణానికి కారకులైయ్యారనే విమర్శలు వెల్లు వెత్తాయి. అది మరవకముందే దేవస్థానం అధికారులు అప్రమత్తంగా ఉండాలని భక్తులు కోరుతున్నారు. అదే విధంగా ప్రస్తుతం శ్రీశైలం దేవస్థానంలో సర్వీసు రిము అయిన మాజి ఉద్యోగి భద్రతా అధికారి గంగా సధన్ లో గత కొన్ని రోజులుగ వసతి గదిని ఖాలి చేయకుండా ఉండటం శ్రీశైలంలో హాట్ టాపిక్ గా మారింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి మొన్న జరిగిన సంఘటనలో భక్తులకు వివరణ ఇచ్చిన సందర్భంలో ఎవరైన కాని 48 గంటలు మించి దేవస్థానం అతిది గృహంలో ఉండకుడదు అలానే దేవస్థానం సిబ్బంది కూడ 48 గంటలు మించి వసతి గదులను అద్దెకు ఇవ్వకుడదు అంటు మీడియాకు వివరించారు. అటువంటి సందర్భంలో సర్వీసు రిము అయిన మాజి ఉద్యోగి గంగా సధన్ లో కొన్ని రోజులుగా అద్దె చెల్లిస్తూ ఒకే రూమ్ లో దేవస్థానం నిభందనలకు విరుద్ధంగా ఉంటున్నారనే విర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటికైన దేవస్థానం అధికారులు అప్రమత్తమై ఎద్దైన జరగరాని సంఘటన జరగకముందే చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

# తిరుమలలో 'తిష్ట'.. బదిలీకి బ్రేక్

- మూడేళ్ల నిబంధనకు కొందరు అధికారుల 'మినహాయింపు '- ఏళ్ల తరబడి అదే కొండపై కీలక పోస్టుల్లో పాతుకుపోయారన్న ఆరోపణలు
- రిసెప్షన్ సహా సున్నిత విభాగాల్లో దీర్ఘకాల పోస్టింగులపై అనేక అనుమానాలు - పలుకుబడి ఉంటే స్థానచలనం ఉండదా.? - టీటీడీ పారదర్శకతపై భక్తుల సందేహాలు

**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి కొండపై నిబంధనల పాలనకు పెద్దపీట వేయాల్సిన తిరుమల తిరుపతి దేవస్థానంలో కొందరు అధికారుల దీర్ఘకాల పోస్టింగులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా ఒకే చోట దీర్ఘకాలం పనిచేయకుండా బదిలీలు, స్థానచలనాలు చేపట్టాల్సి ఉన్న తిరుమలలో మాత్రం కొందరు అధికారులు సంవత్సరాల తరబడి అదే ప్రాంతంలో కొనసాగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భక్తులతో నేరుగా సంబంధం ఉండే రిసెప్షన్ వంటి కొన్ని కీలక విభాగాల్లోనూ దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారుల వ్యవహారంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మూడేళ్లకోసారి బదిలీ.. మరి వీరికి ఎందుకు కాదు.? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

### కొండ దిగరా.?

టీటీడీలో ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులకు సంబంధించి పరిపాలనా నిబంధనలు, మార్గదర్శకాలు అమల్లో ఉంటాయి. సున్నితమైన విభాగాల్లో ఒకే అధికారి ఎక్కువకాలం కొనసాగకుండా రొటేషన్ విధానం పాటించాల్సిన అవసరం కూడా ఉంటుంది. అయితే తిరుమలలో కొందరు అధికారులు మాత్రం సాధారణ బదిలీ చక్రాన్ని దాటి కొనసాగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఒకసారి తిరుమలలో కీలక పోస్టు దక్కితే అదే ప్రాంతంలో మరో పోస్టు, ఆ తర్వాత ఇంకో బాధ్యత అంటూ స్థానచలనం లేకుండా కొనసాగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.బదిలీ ఉత్తర్వులు అందరికీ ఒకేలా వర్తిస్తాయా.? లేక కొందరికి ప్రత్యేక వెసులుబాటు ఉందా.? టీటీడీ ఉన్నతాధికారులు దీనిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### రిసెప్షన్ 'రిజర్వు' పోస్టా.?

తిరుమలలో భక్తుల వసతి, గదుల కేటాయింపు, రిసెప్షన్, ఫిర్యాదుల స్వీకరణ తదితర అంశాల్లో కీలక పాత్ర పోషించే విభాగాల్లో పనిచేసే అధికారులు అత్యంత జవాబుదారీతనంతో వ్యవహరించాలి.అలాంటి చోట ఒకే అధికారి ఏళ్ల తరబడి కొనసాగితే సహజంగానే అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదులు, వసతి కేటాయింపులు, సిఫారసులు, ప్రోటోకాల్ వ్యవహారాలు వంటి సున్నితమైన అంశాలపై దీర్ఘకాల పోస్టింగ్ ప్రభావం చూపకుండా టీటీడీ ప్రత్యేకంగా పర్యవేక్షించాల్సి ఉంటుంది.
అయితే రిసెప్షన్ వంటి విభాగాల్లో కొందరు అధికారులు సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారన్న ఆరోపణలపై టీటీడీ వివరణ ఇవ్వాల్సి ఉంది.

### 'పలుకుబడి' ఉంటే పోస్టింగ్ పదిలమా.?

తిరుమలలో కొందరు అధికారులు రాజకీయ, పరిపాలనా స్థాయిలో తమకున్న పరిచయాలను ఉపయోగించుకుని స్థానచలనం లేకుండా కొనసాగుతున్నారన్న ఆరోపణలు చాలా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు నిజమా.? కాదా.? అన్నది అధికారులు తెలపవలసిన అవసరం ఉంది. ఎవరైనా అధికారి పనితీరు ఆధారంగా కొనసాగించాల్సిన అవసరం ఉంటే.. అందుకు సంబంధించిన పరిపాలనా కారణాలు ఉండాలి. అవి రికార్డుల్లో ఉండాలి. కానీ కారణాలు స్పష్టంగా లేకుండా వరుసగా పోస్టింగులు కొనసాగితేనే అనుమానాలకు తావిస్తుంది. 'ఎవరి సిఫారసుతో కొనసాగుతున్నారు.? 'ఎన్ని సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో ఉన్నారు.? 'ఎన్ని సార్లు పోస్టింగ్ పొడిగించారు.? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత టీటీడీదే అని భక్తులు పేర్కొంటున్నారు.

### ఉన్నతాధికారుల అండదండలా.?

తిరుమలలో ఉన్నతాధికారుల వద్ద తమ పలుకుబడిని పెంచుకుని పోస్టింగులను కాపాడుకుంటున్నారన్న విమర్శలు ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నాయి.ఉన్నతాధికారుల నిర్ణయాలను ప్రశ్నించకుండా అనుసరించడం, వ్యక్తిగత విధేయత చూపడం ద్వారా కీలక పోస్టుల్లో కొనసాగుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.ఇవి నిజమైతే.. అది ఒక్క అధికారికి సంబంధించిన అంశం కాదు. మొత్తం పరిపాలనా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అంశం.ఎందుకంటే బదిలీ అనేది ఉద్యోగులపై శిక్ష కాదు. పరిపాలనలో పారదర్శకత, రొటేషన్, జవాబుదారీతనం కోసం చేపట్టే సాధారణ ప్రక్రియ అన్నది ఉన్నతాధికారులు మర్చిపోవద్దు.

### నిబంధనలు.. కొందరికేనా.?

సాధారణ ఉద్యోగి ఒకే స్థానంలో నిర్దిష్ట కాలం పూర్తి చేయగానే బదిలీకి సిద్ధం కావాల్సి వస్తుంది. కానీ అదే నిబంధన ఉన్నతస్థాయి అధికారులు, కీలక విభాగాల్లో పనిచేసేవారికి వర్తించకపోతే వ్యవస్థపై నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది.నిబంధనలు తుంగలో తొక్కుతున్నారా.?లేదా నిబంధనల్లోనే మినహాయింపులున్నాయా.?
ఇది టీటీడీ అధికార యంత్రాంగం స్పష్టం చేయాల్సిన అంశం.

### తిరుమలలో పారదర్శకత ఎక్కడ.?

కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమలలో పరిపాలనపై చిన్న అనుమానం వచ్చినా అది పెద్ద చర్చకు దారితీస్తుంది. అందుకే కీలక పోస్టుల్లో ఉన్న అధికారుల బదిలీలు, పోస్టింగులు, పొడిగింపులపై స్పష్టమైన విధానం ఉండాలి. ఎవరు ఎప్పుడు తిరుమలలో చేరారు.? ఎంతకాలంగా ఒకే విభాగంలో ఉన్నారు.?
ఎన్ని సంవత్సరాలుగా తిరుమలలోనే పనిచేస్తున్నారు.? వారికి మధ్యలో బదిలీ జరిగిందా.? జరిగితే మళ్లీ తిరుమలలోనే పోస్టింగ్ ఎలా వచ్చింది.? పొడిగింపు ఇచ్చి ఉంటే ఏ నిబంధన కింద ఇచ్చారు.? ఈ వివరాలను పరిశీలిస్తేనే అసలు పరిస్థితి



వెలుగులోకి వస్తుందని 'తిరుమలే శాశ్వత నిలయం' అన్న భావన ఎందుకు.? ఉద్యోగుల బదిలీల ప్రధాన ఉద్దేశం వ్యక్తుల ప్రభావం కాకుండా వ్యవస్థ బలోపేతం కావడం. ఒకే వ్యక్తి ఒకే చోట ఎక్కువకాలం పనిచేయడం వల్ల వ్యవస్థలో వ్యక్తిగత పరిచయాలు, ప్రభావాలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే కీలక విభాగాల్లో రొటేషన్ విధానం కీలకం. కానీ తిరుమలలో కొందరు అధికారులకు మాత్రం 'ఇక్కడి నుంచి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు' అన్న పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే.. కారణాలేమిటన్నది బయటకు రావాలి.

### బదిలీ చేస్తే తప్పేంటి.?

ఎవరైనా అధికారి సమర్థవంతంగా పనిచేస్తున్నారనే కారణంతోనే నిరవధికంగా అదే స్థానంలో కొనసాగించాల్సిన అవసరం ఉందా.? లేక సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మరో అధికారికి అవకాశం ఇవ్వడం మంచిదా.? ఇది కేవలం వ్యక్తుల ప్రశ్న కాదు. వ్యవస్థపై నమ్మకానికి సంబంధించిన అంశం. టీటీడీ యాజమాన్యం సమగ్రంగా సమీక్ష నిర్వహించి, దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న అధికారుల వివరాలను పరిశీలించాలి. నిబంధనలకు అనుగుణంగా ఉంటే కొనసాగింపునకు కారణాలు వెల్లడించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వెంటనే స్థానచలనం చేపట్టాలి. శ్రీవారి కొండపై 'పలుకుబడి' కాదు, నిబంధనలే రాజ్యమేలాలి. తిరుమలలో పోస్టింగ్ అనేది అధికారులకు ప్రత్యేక హక్కుగా మారకూడదు. అది భక్తులకు సేవ చేసే బాధ్యతగా ఉండాలి. శ్రీవారి సన్నిధిలో పనిచేసే ప్రతి అధికారి నిబంధనలకు లోబడి, పారదర్శకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందే.

# టీటీడీ అధికారి ఇంటిపై ఏసీబీ దాడి

- లోకనాథంపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- ఒక్కచోట కాదు,ఐదు చోట్ల ఏకకాలంలో సోదాలు
- తిరుమల కార్యాలయం.. బంధువులు, సోదరుడి ఇళ్లలోనూ తనిఖీలు

**తిరుపతి(ప్రశ్న న్యూస్)** తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో మెండు లోకనాథం ఇంటిపై ఏసీబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి సోదాలు చేపట్టారు. తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లో ఉన్న లోకనాథం నివాసంలో ఉదయం 6 గంటల నుంచి ఏసీబీ బృందాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి.ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఏకకాలంలో ఐదు ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. తిరుపతిలోని లోకనాథం ఇద్దరు బావమరుదుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించారు.

అదేవిధంగా తిరుమలలోని లోకనాథం కార్యాలయంలోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలోని లోకనాథం సోదరుడి నివాసంలోనూ మరో బృందం సోదాలు నిర్వహిస్తోంది.సోదాల్లో అధికారులు ఏయే ఆస్తులు, పత్రాలు, నగదు తదితర వివరాలను గుర్తించారన్నది తెలియాల్సి ఉంది. సోదాలు పూర్తయిన అనంతరం ఏసీబీ అధికారులు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయా.? అన్నది ఆసక్తికరంగా మారింది.



# ఉత్తరాంధ్రకు గోదావరి జలహారతి

- పోలవరం ఎడమ కాలువ జలాలకు సీఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు పుష్పాలు సమర్పించి హారతి
- జలాలను శిరస్సుపై చల్లుకున్న ముఖ్యమంత్రి
- గోదారమ్మకు అడుగడుగునా స్వాగతం పలికిన ఉత్తరాంధ్ర ప్రజలు



**అనకాపల్లి (ప్రశ్న న్యూస్)** ఉత్తరాంధ్ర నేలకు గోదావరి జలాలు చేరడంతో పాయకరావుపేటలో పండగ వాతావరణం నెలకొంది. పాయకరావుపేట క్రాస్ రెగ్యులేటర్ నుంచి పోలవరం ఎడమ కాలువలోకి చేరుతున్న గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలువలోనే నిలిచి పుష్పాలు సమర్పించి జలహారతి ఇచ్చారు.అనంతరం పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకుని భక్తిభావాన్ని చాటుకున్నారు. మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, నారాయణ, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, ఎంపీలు విజయ్, సీఎం రమేష్ తదితరులు సీఎం వెంట ఉండి జలాలకు పూజలు చేశారు.పుష్పాలతో స్వాగతంపాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువకు ఇరువైపులా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గోదావరి జలాలకు పుష్పాలతో స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులు ఇస్తూ గోదారమ్మ ప్రవాహాన్ని ఆహ్వానించారు. కాలువలో అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి ఉత్తరాంధ్ర ప్రజలు పులకించిపోయారు.గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# సైబర్ సెక్యూరిటీలో గూగుల్ ముందడుగు

- 'జెమిని 3.8 ఫ్లాష్ సైబర్' విడుదల



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** టెక్ దిగ్గజం గూగుల్ సైబర్ సెక్యూరిటీ రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. తమ అత్యంత శక్తివంతమైన సైబర్ సెక్యూరిటీ ఏఐ మోడల్ "జెమినీ 3.8 ఫ్లాష్ సైబర్"ను పరిచయం చేస్తున్నట్లు ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు. సైబర్ భద్రతకు సంబంధించిన లోపాలను అత్యంత వేగంగా గుర్తించి, వాటిని అంతే వేగంగా సరిదిద్దడంలో ఈ మోడల్ అద్భుతమైన పనితీరు కనబరుస్తుందని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ ఏఐ మోడల్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు నిర్వహించిన పరిశ్రమల ప్రామాణిక 'సైబర్‌జిమ్' బెంచ్‌మార్క్‌లో ఇది 86.2 శాతం స్కోరును సాధించిందని ఆయన తెలిపారు. అదేవిధంగా, లోపాలను సరిచేసే విషయంలో 'జఔజు-బెంచ్' పరీక్షలో 47.2 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. గూగుల్ అందిస్తున్న ఇతర ఫ్లాష్ మోడల్స్ తరహాలోనే ఇది కూడా వేగవంతమైన పనితీరును, తక్కువ ఖర్చుతో కూడిన లభ్యతను కలిగి ఉంటుందని సుందర్ పిచాయ్ వివరించారు. గూగుల్ నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో దాదాపు 20 ప్రోగ్రామింగ్ భాషల్లోని లోపాలను కనుగొనడంలో ఈ మోడల్ 70 శాతం కంటే ఎక్కువ సక్సెస్ రేటును నమోదు చేసినట్లు సుందర్ పిచాయ్ వెల్లడించారు. అత్యున్నత స్థాయి పనితీరును కనబరుస్తూనే, "ఫ్లాష్" స్థాయి వేగంతో, సరసమైన ధరకే ఈ మోడల్ అందుబాటులోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ఉబర్‌లో భారీ లేఆఫ్‌లు

- 3,300 మంది ఉద్యోగుల తొలగింపు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్ టెక్నాలజీస్' తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వంటి కీలక వ్యాపార విభాగాల్లో పెట్టుబడులను సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ లేఆఫ్‌ల ప్రభావం 20 శాతం మంది మేనేజర్లతో పాటు, ఇతర స్థాయిల సిబ్బందిపై కూడా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపుతో పాటు, ఉబర్ తన రిమోట్ వర్క్ విధానానికి దాదాపు స్వస్తి పలికింది. భవిష్యత్తులో కేవలం ఒక శాతం మంది ఉద్యోగులకు మాత్రమే ఇంటి నుండి పనిచేసే అనుమతి ఉంటుందని, మిగిలిన వారంతా తప్పనిసరిగా కార్యాలయాల నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ లేఆఫ్‌ల అనంతరం ఉబర్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. తద్వారా సంస్థ సిబ్బంది సంఖ్య తిరిగి 2021 నాటి స్థాయికి చేరుకోనుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588